Bhavani Publication Trust
https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక




సంపుటి : 26 | సంచిక : 142 | హైదరాబాద్ | మంగళవారం 14 ఏప్రిల్ 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-
Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR

# జగిత్యాలలో జంగ్ సైరన్!

## ఈ నెల 20 బీఆర్ఎస్ ప్లీనరీ.. హాజరు కానున్న అధినేత కేసీఆర్

### వేదిక నుంచి మళ్లీ టీఆర్ఎస్‌గా ప్రకటన?.. సభ ఇన్‌చార్జిలను ప్రకటించిన కేటీఆర్



**అధికార కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ జంగ్ సైరన్ మోగించనుంది. సుమారు రెండున్నరేళ్లు సమయం ఇచ్చిన కేసీఆర్ ఇక స్వయంగా రంగంలోకి దిగి కాంగ్రెస్‌తో సమరానికి సిద్ధం అవుతున్నారు.**

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించే పార్టీ ప్లీనరీకి అధినేత కేసీఆర్ హాజరుకానున్నట్లు సమాచారం. ఈ వేదికపైనే సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డి చేరికతో పాటు పార్టీ భవిష్యత్ కార్యాచరణ ప్రకటించను న్నారు. ఉత్తర తెలంగాణలో మళ్లీ పట్టు సాధించాలనే లక్ష్యంతో ఈసారి పార్టీ ప్లీనరీ నిర్వహించాలని బీఆర్ఎస్ యోచిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే పార్టీ ప్రక్షాళన, ప్రభుత్వంపై సమరం చేసేందుకు అధినేత కేసీఆర్ సిద్ధం కావడంతో పాటు పార్టీ శ్రేణులను సిద్ధం చేస్తున్నారు.

**మళ్లీ బీఆర్ఎస్‌గా..**

టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చడంతో జనానికి దూరం అయ్యామని ఇటీవల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

- మిగతా 2వ పేజీలో

Degree Online Services, Government of Telangana

## డిగ్రీ అడ్మిషన్లకు దోస్త్

### నోటిఫికేషన్ విడుదల..

### ఏప్రిల్ 15 నుంచి దరఖాస్తులు ప్రారంభం

(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా )

రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం (2026-27)లో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో సీట్ల భర్తీకి నిర్వహించే దోస్త్ (ఐూూ) నోటిఫికేషన్‌ను తెలంగాణ ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. ఏప్రిల్ 15వ తేదీ నుంచి మే 7వ తేదీ వరకు తొలి విడతలో సీట్ల భర్తీ ప్రక్రియ కొనసాగుతుంది. అర్హులైన విద్యార్థులు రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. మే 14వ తేదీన తొలి దశ సీట్ల కేటాయింపు జరగనుంది. సీట్ల కేటాయింపు అనంతరం ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఇక రెండో దశ సీట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మే 15వ తేదీ నుంచి మే 25వ తేదీ వరకు కొనసాగనుంది. మే 15వ తేదీ నుంచి మే 26వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. మే 30వ

- మిగతా 2వ పేజీలో



## నారీ శక్తికి పట్టం కట్టేందుకే!

### మహిళా రిజర్వేషన్లపై ప్రధాని

2029 నుంచే చట్టసభల్లో అమలు

ఈ శతాబ్దికే అతి ముఖ్య నిర్ణయం

నారీ శక్తి వందన్ సదస్సులో మోదీ

న్యూఢిల్లీ: చట్టసభల్లో సముచిత ప్రాతినిధ్యం కోసం మహిళల దశాబ్దాల ఎదురుచూపులకు అతి త్వరలో తెర పడనుందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను 2029 నుంచే అమలు చేసేలా నారీ శక్తి వందన్ అధినియమ్‌కు రాజ్యాంగ సవరణ చేపట్టనున్నట్టు గుర్తు చేశారు. ఇందుకోసం గురువారం నుంచి పార్లమెంటు మూడు రోజుల పాటు సమావేశం కానుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ఢిల్లీలో

- మిగతా 2వ పేజీలో



# హైబ్రిడ్‌గా సీట్లు పెంచాలి

### జనాభా ప్రకారం 50%, జీఎస్‌డీపీ ప్రాతిపదికన మరో 50% పెంచాలి: సీఎం రేవంత్

- పెంచే 272 లోక్‌సభ సీట్లలో 136
- జనాభా లెక్కన, మరో 136 జీఎస్‌డీపీ
- ప్రకారం రాష్ట్రాలకు కేటాయించాలి
- ప్రధాని ప్రతిపాదన వల్ల దక్షిణాది, ఉత్తరాది మధ్య భారీ అంతరం
- కాంగ్రెస్ ఎంపీలు తెలంగాణ సాధించారు
- పునర్విభజనపైనా పోరాడతారు
- ఈ పోరాటంలో దక్షిణాదితోపాటు చిన్న రాష్ట్రాలనూ ఏకం చేస్తాం

**చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన, సీట్ల పెంపు బిల్లులపై కేంద్ర ప్రభుత్వం హడావుడి చేస్తోందని.. దీనివల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం చేసేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు.**

### ముందు మహిళా బిల్లు ఆమోదించాలి.. ఆ తర్వాతే సీట్ల పెంపు, పునర్విభజనపై విస్తృత చర్చ జరపాలి

ఏప్రిల్ 13 (ప్రజాతీర్పు)

మహిళా రిజర్వేషన్ల బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన రెండు వేర్వేరనే విషయాన్ని మరుగున పెట్టి, రెండింటినీ జనాభా లెక్కల తర్వాత ఆమోదింప చేసుకోవాలని ప్రధాని మోదీ యోచిస్తున్నారని విమర్శించారు. మహిళా రిజర్వేషన్, పునర్విభజన బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని.. ప్రపంచంలోనే భారత్‌లో మహిళలకు ఓటు హక్కు కల్పించిన పార్టీ కాంగ్రెస్ అని రేవంత్ గుర్తుచేశారు. నియోజకవర్గాల పునర్విభజన, సీట్ల పెంపు కేవలం జనాభా ప్రాతిపదికన చేయడం సరైంది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ ఆర్థిక నిర్మాణం, రాష్ట్రాల భాగస్వామ్యాన్ని పరిగణనలోకి తీసుకొని సీట్ల పెంపు జరగాలని డిమాండ్ చేశారు. అందుకోసం 'హైబ్రిడ్ మోడల్' అవసరమని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. పెంచబోయే 272 లోక్‌సభ స్థానాల్లో 136 సీట్లను జనాభా ప్రాతిపదికన మరో 136 సీట్లను జీఎస్‌డీపీ ఆధారంగా ఆయా రాష్ట్రాలకు కేటాయించాలని సీఎం ప్రతిపాదించారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌పై ప్రత్యేకంగా పార్లమెంటు సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులు, ఎంపీలతో కలిసి సచివాలయంలో సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలోని ముఖ్యాంశాలు

- మిగతా 2వ పేజీలో



## దొడ్డిదారిన డీలిమిటేషన్

మహిళా కోటా బిల్లు ముసుగులో కేంద్రం కుట్ర

డీలిమిటేషన్‌కు రాజకీయ ప్రాతినిధ్యాన్ని తీసుకోవాలి

ఏఐసీసీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ

- 2లో



## నోయిడాలో కార్మికుల ఆందోళన హింసాత్మకం

వాహనాలకు నిప్పు, రోడ్ల దిగ్బంధం

ఢిల్లీ-నోయిడా సరిహద్దుల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్

రూ.20 వేల కనీస వేతనం, 8 గంటల పని తదితర డిమాండ్లతో కార్మికుల ఆందోళనలు

న్యూఢిల్లీ/నోయిడా, ఏప్రిల్ 13: కనీస వేతనం రూ.20 వేలకు పెంపు, 8 గంటల పని తదితర డిమాండ్లతో ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో కార్మికులు చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారింది. సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్లపైకి వందలాదిగా చేరుకున్న కార్మికులు భద్రతా సిబ్బందిపై రాళ్లు విసరడం, వాహనాలకు నిప్పు పెట్టడంతో పాటు జాతీయ రహదారి-9తో పాటు పలు రోడ్లను దిగ్బంధించారు. దీంతో కీలకమైన ఢిల్లీ-నోయిడా సరిహద్దుల్లో భారీగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. రహదారులపై వాహనాలు కొన్ని గంటల పాటు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు యత్నించడంతో

- మిగతా 2వ పేజీలో



- 2లో

# సమ్మెకు సై

### ఈనెల 22న తొలి షిఫ్ట్ నుంచే అని ప్రకటించిన ఆర్టీసీలో ఒక జేఏసీ

కార్మికశాఖ ఉప కమిషనర్‌తో చర్చలు విఫలం..హాజరు కాని ఆర్టీసీ అధికారులు

తటస్థంగా ఆర్టీసీలోని మరో జేఏసీ, కొన్ని సంఘాలు





- 2లో

# కూల్చివేతలు ఆపండి..

హైడ్రాకు హైకోర్టు షాక్.. తదుపరి ఆదేశాలిచ్చే వరకు కార్యకలాపాలు ఆపేయండి

జలాశయాలు, కాలువలు, రహదారుల అంశాల్లో తప్ప కూల్చివేతలొద్దు

ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని కోర్టుకు సమర్పించండి

జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం ఆదేశం

ఐలాపూర్‌లోని కూల్చివేతను సవాల్ చేస్తూ ఓ వృద్ధుడి లంచ్‌మోషన్ పిటిషన్

# డిగ్రీ అడ్మిషన్లకు దోస్త్

(మొదటి పేజీ తరువాయి)

తేదీ సీట్లు కేటాయిస్తారు. మూడో విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ మే 31వ తేదీ నుంచి జూన్ 15వ తేదీ వరకు జరగనుంది. జూన్ 16వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. జూన్ 20వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది. రెండో, మూడో విడత సీట్ల కేటాయింపు అనంతరం కూడా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో జూన్ 20 నుంచి 27వ తేదీ మధ్యలో హాజరై అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. జూన్ 29, 30వ తేదీల్లో ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూలై 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

# నోయిడాలో కార్మికుల ఆందోళన హింసాత్మకం

(మొదటి పేజీ తరువాయి)

ఘర్షణ పరిస్థితులు నెలకొన్నాయి. ఫేజ్-2 ఏరియాలో కార్మికులు రెండు వాహనాలను ధ్వంసం చేయడంతో పాటు మరో రెండు బైక్‌లకు నిప్పుపెట్టారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నించిన భద్రతా సిబ్బంది, పరిశ్రమల భవనాలపై ఆందోళనకారులు రాళ్లు విసిరినట్లు తెలుస్తోంది. పరిస్థితులను నియంత్రణలోకి తీసుకొచ్చేందుకు భారీగా పోలీసు బలగాలను మోహరించారు. కార్మికుల ఆందోళనల నేపథ్యంలో నోయిడా అథారిటీలో అధికారులు కీలక సమావేశం నిర్వహించారు. కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించడం, ఓవర్ టైమ్‌కు రెట్టింపు వేతనాలు, బోన్‌సల చెల్లింపు, వారంతపు సెలవులు, పని ప్రదేశంలో మెరుగైన పరిస్థితులు కల్పించడం వంటి అంశాలపై చర్చించారు. తక్కువ వేతనాలతో పడుతున్న వెతలపై కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. నెలకు రూ.15 వేల కంటే తక్కువ జీతంతో ఎలా బతకాలని ప్రశ్నించారు. రోజుకు 12 గంటల పని కూడా చేయించుకుంటున్నారని కొంత మంది చెప్పారు. హరియాణలోని గుర్‌గావ్ పారిశ్రామిక బెల్ట్‌లో ఈనెల మొదట్లో కార్మికులు చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల కనీస వేతనాన్ని వారి నైపుణ్య స్థాయిలను బట్టి 35% వరకు పెంచింది. ఈ నేపథ్యంలో తమకు కూడా అదేవిధంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ యూపీలోని నోయిడాలో కూడా ఆందోళనలు ఉధృతమయ్యాయి. కార్మికుల ఆందోళనలపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. ప్రతి కార్మికుడు గౌరవప్రదమైన వేతనం పొందాలన్నారు.

# ఆర్టీసీలో సమ్మెకు సై

ఏప్రిల్ 13 (ప్రజాతీర్పు)

తమ డిమాండ్లపై ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోవటంతో ఆర్టీసీలోని ఓ జేఏసీ సమ్మెకు సిద్ధమైంది. ఈనెల 22న తెల్లవారుజామున తొలి షిఫ్ట్ నుంచి సమ్మె ప్రారంభిస్తున్నట్టు వెల్లడించింది. ఆర్టీసీలోని మరో జేఏసీ, కొన్ని ఇతర సంఘాలు తటస్థంగా ఉన్నాయి. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, గత ప్రభుత్వం రద్దు చేసిన ఆర్టీసీ కార్మిక సంఘాల పునరుద్ధరణ, బకాయి ఉన్న రెండు వేతన సవరణల అమలు, అంతకుముందు వేతన సవరణ బకాయిల చెల్లింపు, ఆర్టీసీ వాడేసుకున్న ఉద్యోగుల పీఎఫ్, సీసీఎస్ నిధుల తిరిగి చెల్లింపు, ఆర్టీసీలో అద్దె ప్రాతిపదికన నడుపుతున్న ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీకి అందివ్వటం, కార్మికులపై తీవ్ర పనిఒత్తిడి ఉన్నందున వెంటనే ఖాళీలను భర్తీ చేయటం.. ఇలా మొత్తం 32 డిమాండ్లను ఆర్టీసీ జేఏసీ ప్రభుత్వం ముందు ఉంచింది. గత ఏడాది కాలంగా ఈ డిమాండ్ల సాధనకు ఒత్తిడి తెస్తున్నా ఫలితం లేదు. దీంతో సమ్మెకు సిద్ధమన్న సంకేతాలిచ్చింది. అయినా స్పందన లేకపోవటంతో, గత నెల 13న సమ్మె నోటీసు ఇచ్చింది. దీంతో గత నెలాఖరులో చర్చలకు రావాల్సిందిగా కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఆహ్వానించింది. అప్పుడు అసెంబ్లీ సమావేశాల కారణంగా చర్చలను అర్ధంతరంగా రద్దు చేసింది. తిరిగి ఈనెల 8న మరోసారి చర్చలకు ఆహ్వానించింది. జేఏసీ నేతలు వచ్చినా, ఆర్టీసీ అధికారులు గైర్హాజరు కావటంతో 13న మరోసారి చర్చలకు పిలిచింది. ఈసారి ఆర్టీసీ అధికారులు గైర్హాజరైతే, తాము మాత్రం సమ్మె తేదీ ప్రకటించి సమ్మెకు దిగుతామని జేఏసీ నేతలు అప్పుడే ప్రకటించారు. అనుకున్నట్టు గానే సోమవారం చర్చలకు ఆర్టీసీ అధికారులు రాలేదు. డిమాండ్లకు సంబంధించి ఐదు అంశాలు తమ పరిధిలో లేవని, అవి ప్రభుత్వ పరిధిలో ఉన్నాయని, వాటిపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పేర్కొంటూ అధికారులు కార్మిక శాఖ ఉప కమిషనర్ కార్యాలయానికి ఓ లేఖ పంపారు. దీంతో చర్చలు విఫలమైనట్టుగానే జేఏసీ నేతలు పేర్కొంటూ, సంప్రదింపులకు స్వస్తి పలికామని, ఈనెల 22 నుంచి సమ్మె ప్రారంభిస్తామని, చర్చల అనంతరం ప్రకటించారు. సోమవారం మధ్యాహ్నం ఖైరతాబాద్ రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో ఓ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కొన్ని ఆసక్తికర కామెంట్లు చేశారు. సమ్మెకు కార్మిక సంఘాలు సిద్ధమైన నేపథ్యంలో ప్రభుత్వం వాటితో చర్చిస్తుందా అని విలేకరులు ప్రశ్నించగా, అసలు ఆర్టీసీలో కార్మిక సంఘాలే లేనప్పుడు కార్మిక నేతలతో చర్చల అంశానికి తావెక్కడిదని సమాధానమిచ్చారు.

### ప్రజా ఉద్యమంగా మారుస్తాం: జేఏసీ

ఈనెల 22న తెల్లవారుజాము నుంచి సమ్మె మొదలు పెట్టాలని నిర్ణయించినందున, మంగళవారం నుంచి తాము ప్రజల్లోకి వెళ్తామని జేఏసీ నేతలు థామస్‌రెడ్డి, వెంకన్న తెలిపారు. ఈ సమ్మెను కార్మికుల సమ్మెగా కాకుండా ప్రజాఉద్యమంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. తాము ప్రభుత్వం ముందుంచిన 32 డిమాండ్లు సహేతుకమైనవేనని, వాటిని ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# కూల్చివేతలు ఆపండి..

## హైడ్రాకు హైకోర్టు షాక్..

## తదుపరి ఆదేశాలిచ్చే వరకు కార్యకలాపాలు ఆపేయండి

హైదరాబాద్: హైడ్రాకు ఉన్నత న్యాయస్థానం భారీ షాక్ ఇచ్చింది. తాము తదుపరి ఆదేశాలిచ్చే వరకు జలాశయాలు, నాలాలు, పార్కులు, ఆక్రమణల తొలగింపు, ప్రజా రహదారుల పునరుద్ధరణ మినహా అనధికార నిర్మాణాల కూల్చివేత లేదా తొలగింపునకు ఎలాంటి కార్యకలాపాలు చేపట్టవద్దని ఆదేశించింది. జీహెచ్ఎంసీ, పురపాలక సంఘాల చట్టం, ఇతర నిబంధనలకు అనుగుణంగా ప్రామాణిక కార్యాచరణ విధానాలు, మార్గదర్శకాలను సమర్పించాలని స్పష్టం చేసింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ఐలాపూర్ గ్రామంలో హైడ్రా ఓ యుద్ధ వాతావరణాన్ని సృష్టించినట్లు అభిప్రాయపడింది. పెత్తందారీ విధానం, చట్టవిరుద్ధ చర్యల కారణంగా వందలాది పిటిషన్లు దాఖలయ్యాయని చెప్పింది. చాలా పిటిషన్లలో స్పష్టమైన కౌంటర్లు దాఖలు చేయలేదని, సంస్థ తీరు సమర్థనీయం కాదని వ్యాఖ్యానించింది. ఐలాపూర్ కూల్చివేతలపై స్టేటస్‌కో ఆదేశాలు పాటించాలని చెబుతూ విచారణ ఈ నెల 20కి వాయిదా వేసింది.

### వెయ్యి ఎకరాల కబ్జాకు యత్నం: ఏఏజీ

అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. 'సంగారెడ్డిలోని కోర్టు ఇచ్చిన డిక్రీని అడ్డుపెట్టుకుని ఐలాపూర్‌లో పలు సర్వే నంబర్లలోని వెయ్యి ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి పిటిషనర్ ప్రయత్నిస్తున్నారు. హైడ్రా కూల్చివేసిన భవనం ప్రభుత్వ భూమిలో నిర్మించిందే. ఆ భవనానికి విద్యుత్, నిర్మాణ అనుమతులు లేవు'అని చెప్పారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. 'కూల్చివేసిన భవనం కోర్టు విచారణలో ఉన్న ఆస్తిలోని ఓ భాగం. ఆ కేసులోనే వివాదాస్పద డిక్రీ జారీ అయ్యింది. 2006లో నాటి ఉమ్మడి ప్రభుత్వంపై పిటిషనర్ ఈ దావా వేశారు. అలాగే, 2024లో ప్రతివాద అధికారులు జోక్యం చేసుకున్నప్పుడు పిటిషనర్ రిట్ పిటిషన్ కూడా వేశారు. రిట్ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం సంబంధిత స్థలంలో ప్రస్తుతమున్న నిర్మాణాలను తొలగించడానికి, చట్టబద్ధమైన ప్రక్రియను పాటించకుండా ఎటువంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

# జగిత్యాలలో జంగ్ సైరన్!

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ పేర్కొన్నారు. కొన్ని తప్పులు చేశామని వాటిని సరిదిద్దుకుంటామని అన్నారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్‌ను మళ్లీ టీఆర్ఎస్‌గా మార్చే అవకాశాన్ని పరిశీలిస్తామని ప్రకటించారు. అయితే, ఈ నెల 20న జగిత్యాలలో జరిగే ప్లీనరీ వేదికపై నుంచి పార్టీ అధినేత కేసీఆర్ పార్టీ పేరును భారత రాష్ట్ర సమితి నుంచి తెలంగాణ రాష్ట్ర సమితిగా మారుస్తూ ప్రకటన చేస్తారని భావిస్తున్నారు. టీఆర్ఎస్ పేరు ఖాళీగా ఉందని, ఎవరైనా వినియోగించుకోవచ్చునని సాక్ష్యాత్తు పార్టీ అధినేత కుమార్తె కవిత ప్రకటించిన క్రమంలో ఈపేరు మార్పు ప్రాధాన్యం నెలకొంది. అలాగే, పార్టీని కిందిస్థాయి నుంచి ప్రక్షాళన చేయాలని భావిస్తున్నారు. మళ్లీ పార్టీలో ఉద్యమ కారులకు అవకాశం ఇవ్వాలని, పార్టీ కోసం పని చేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నారు. జగిత్యాల ప్లీనరీ సాక్షిగా ఈ మార్పులు చేయాలని అధినేత భావిస్తున్నట్లు బీఆర్ఎస్ శ్రేణులు చర్చించుకుంటున్నాయి.

### ఇన్‌చార్జిల నియామకం

జగిత్యాలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ కోసం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇన్‌చార్జిలను ప్రకటించారు. ఈ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీ, ఈ, సభ విజయవంతం కోసం సీనియర్ నాయకులకు బాధ్యతలు అప్పగించింది. ముఖ్యంగా జగిత్యాల జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు సంబంధించి ప్రత్యేక ఇన్‌చార్జిలను కేటీఆర్ ఖరారు చేశారు. జగిత్యాల: పల్లా రాజేశ్వర్ రెడ్డి (ఎమ్మెల్యే, జనగామ), కోరుట్ల: వేముల ప్రశాంత్ రెడ్డి (మాజీ మంత్రి, ఎమ్మెల్యే, బాల్కొండ), ధర్మపురి: తక్కల్లపల్లి రవీందర్ రావు (ఎంఎల్సీ), వేములవాడ: బాల్క సుమన్ (మాజీ ఎమ్మెల్యే), చొప్పదండి: పెద్ది సుదర్శన్ రెడ్డి (మాజీ ఎమ్మెల్యే) లను ఇన్‌చార్జిలుగా నియమించారు. సభకు వచ్చే జన సమీకరణ, ప్రాంగణ ఏర్పాట్లు మరియు నిర్వహణ బాధ్యతలను పార్టీ సీనియర్ నేతలు గాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షించనున్నారు. వీరు క్షేత్రస్థాయిలో ఉండి సభ ముగిసే వరకు అన్ని ఏర్పాట్లను సమన్వయం చేస్తారని కేటీఆర్ పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి జగిత్యాల సభను గ్రాండ్ సక్సెస్ చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# హైబ్రిడ్‌గా సీట్లు పెంచాలి



(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాటల్లోనే...

### హైబ్రిడ్ విధానంతో సమన్యాయానికి అవకాశం

'దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఆదాయం, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. జాతీయ స్థూల ఉత్పత్తి జీఎస్‌డీపీలో దక్షిణాది రాష్ట్రాలే ముందున్నాయి. అలాంటి రాష్ట్రాలను శిక్షించడం తగదు. పన్నులు కట్టడం, సలాం కొట్టడం అనే దానికి మేం వ్యతిరేకం. అందుకే హైబ్రిడ్ మోడల్ ప్రతిపాదిస్తున్నాం. లోక్‌సభలో ప్రస్తుతమున్న 543 సీట్లను 50 శాతం మేర పెంచితే సీట్లు 816కు చేరుతాయి. పెరిగే 272 సీట్లలో 136 దామాషా (ప్రొరాటా) ప్రకారం పెంచుకొని మరో 136 సీట్లను ఆర్థికంగా దేశానికి అందిస్తున్న సేవల ఆధారంగా పెంచాలి. ఈ సీట్ల పునర్విభజనపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి. నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలి. అన్ని రాష్ట్రాల అసెంబ్లీలలో చర్చించాలి. పార్లమెంటులో సమగ్రంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలి. 2028 మార్చి వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయవచ్చు. 2027 మార్చి 31లోగా జనగణన, 2028 మార్చిలోగా పునర్విభజన పూర్తి చేసి 2029లో పెరిగిన సీట్లతో ఎన్నికలకు వెళ్లవచ్చు'అని రేవంత్ సూచించారు.

### మహిళా బిల్లు, పునర్విభజన బిల్లును కలపడం రాజకీయ కుట్ర

'నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లును ఒకటిగా చూపిస్తూ కేంద్రం హడావుడి చేస్తోంది. ఈ రెండింటికీ ఎలాంటి సంబంధం లేదు. వేర్వేరుగా చర్చించి అమలు చేయాలి. మహిళల రిజర్వేషన్ బిల్లు విషయంలో ఆలస్యం చేయడానికి ఈ పద్ధతి ఉపయోగిస్తున్నారు. దేశంలో ప్రధానిగా, రాష్ట్రపతిగా, స్పీకర్‌గా, ముఖ్య మంత్రులుగా మహిళలకు అవకాశాలు కల్పించింది కాంగ్రెస్. రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లు తీసుకొచ్చారు. సోనియా గాంధీ నాయకత్వంలో మహిళా రిజర్వేషన్ బిల్లు--2013లో రాజ్యసభలో ఆమోదం పొందింది. కానీ బీజేపీ సహకరించకపోవడంతో లోక్‌సభలో నిలిచిపోయింది. 2023లో మహిళా రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటులో చర్చకు వచ్చినప్పుడు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇచ్చింది. 2024 ఎన్నికల్లోనే 33% రిజర్వేషన్లు అమలు చేసి ఉంటే 181 మహిళలు లోక్‌సభలో ఉండేవారు. 2026 జనాభా లెక్కల తర్వాత అంటే మహిళల హక్కులను వాయిదా వేయడమే. నియోజకవర్గాల పునర్విభజనతో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటులో పెట్టి ఆమోదించాలి'అని సీఎం సూచించారు.

### జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపుతో దక్షిణానికి అన్యాయం

'దేశంలో 1970 ప్రాంతంలో కుటుంబ నియంత్రణ అమలు చేయాలని కేంద్రం నిర్ణయించినప్పుడు దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను కట్టుదిట్టంగా అమలు చేశాయి. అందుకే జనాభా తగ్గింది. ఉత్తరాదిలో నియంత్రణ లేకపోవడంతో జనాభా పెరిగింది. ఇప్పుడు జనాభా ఆధారంగా సీట్లు పెంచితేం మంచి పనిచేసిన రాష్ట్రాలను శిక్షించినట్లే అవుతుంది. ఇందిరాగాంధీ ఈ విషయాన్ని గమనించి లోక్‌సభ సీట్ల ప్రకారమే నియోజకవర్గాల పునర్విభజన చేయాలని నిర్ణయం తీసుకున్నారు. 25 ఏళ్ల వరకు సీట్ల పెంపును ఇందిరాగాంధీ నిషేధించారు. 2001లో వాజ్‌పేయి పునర్విభజన బిల్లుపై చట్ట సవరణ చేశారు. చట్టపరంగా సీట్ల పెంపుపై నిషేధం విధించారు. ఇప్పుడు జనాభా ప్రాతిపదికన సీట్ల పునర్విభజనకు ఒప్పుకోబోమని దక్షణాది రాష్ట్రాలు నిరసన తెలపడంతో పాటు ప్రధానికి లేఖ రాశాయి. దాంతో దామాషా ప్రకారం 50 శాతం సీట్లు పెంచుతా మంటున్నారు. 20 సీట్లు ఉన్న కేరళకు, 80 సీట్లు ఉన్న యూపీకి ఉన్న అంతరం ప్రస్తుతం 60 సీట్లు మాత్రమే. కానీ 50 శాతం పెంచితే 90 సీట్లకు అంతరం పెరుగుతుంది. తెలంగాణకు, యూపీకి 94 సీట్ల అంతరం పెరుగుతుంది. దక్షణాదిలో 130 సీట్లు ఉన్నాయి. 50 శాతం పెరిగితే 195 అవుతాయి. 413 సీట్లున్న ఉత్తరాదిలో 621 సీట్లు అవుతాయి. దక్షణాది, ఉత్తరాద మధ్య అంతరం 412 సీట్ల నుంచి 620 సీట్లకు పెరుగుతుంది. దీనివల్ల ఒక్క తెలంగాణకే కాదు... దక్షిణాదిలోని అన్ని రాష్ట్రాలతోపాటు గోవా, పంజాబ్, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు కూడా అన్యాయమే జరుగుతుంది. తద్వారా దక్షిణాది, ఉత్తరాది మధ్య వ్యత్యాసం మరింత పెరుగుతుంది. ఇది దేశ సమతౌల్యానికి ప్రమాదకరం'అని సీఎం రేవంత్ హెచ్చరించారు.

### బండి సంజయ్, కిషన్‌రెడ్డి మోదీ ఇంటి ముందు బంట్రోత్తులుగానే..

'50 శాతంతో సీట్ల పునర్విభజన జరిగితే కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ప్రధాని మోదీ ఇంటి ముందు బంట్రోతులుగా నిలబడాల్సి వస్తుంది. వాళ్ల అవసరం ఇకపై ఉండదు. ఉత్తరాది రాష్ట్రాల్లో గెలిచే ఎంపీలతోనే కేంద్ర ప్రభుత్వం నడుస్తుంది. మోదీ గుజరాత్ వదిలి యూపీ నుంచి ఎందుకు పోటీ చేస్తున్నారంటే అక్కడ 80 సీట్లు ఉన్నాయి కాబట్టి. అందుకే హైబ్రిడ్ విధానంలో దేశానికి ఆర్థిక పరిపుష్టిని అందిస్తున్న రాష్ట్రాలకు 50 శాతం కేటాయించాలి. రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు కూడా అదే చెప్పింది. 50 శాతం మెరిట్, 50 శాతం రిజర్వేషన్ అని. దానినే కేంద్రం ఉపయోగించాలి'అని సీఎం సూచించారు. 'బీజేపీ 1980 ఏప్రిల్ 6న ఏర్పాటైంది. ఇప్పటివరకు 15 మంది బీజేపీ అధ్యక్షుల నియామకం జరిగితే ఆ పార్టీ అధ్యక్షురాలిగా ఒక్క మహిళను కూడా నియమించలేదు. జనరల్ సెక్రటరీ ఆర్గనైజేషన్ పదవి కూడా ఇవ్వలేదు. దీన్నిబట్టే బీజేపీకి మహిళలపై గౌరవం, చిత్తశుద్ధి ఎంత ఉందో అర్థమవుతుంది. బీజేపీకి మహిళను అధ్యక్షురాలిగా నియమించుకున్న తర్వాత బండి సంజయ్ మాట్లాడాలి. బండి సంజయ్ వ్యాఖ్యలు దక్షణాది రాష్ట్రాల్లోని ఎస్సీ, ఎస్టీ, మహిళలకు వ్యతిరేకం. మా ఎంపీలు తెలంగాణను సాధించారు. ఇప్పుడు పునర్విభజనపైనా పోరాడుతారు. దక్షణాది రాష్ట్రాలతోపాటు చిన్న రాష్ట్రాలను కూడా ఐక్యం చేస్తాం. పార్లమెంటులో బిల్లును ఎలా ఆమోదిస్తారో చూస్తాం. అన్ని దక్షణాది రాష్ట్రాలతోపాటు ఢిల్లీ, పంజాబ్ లాంటి చిన్న రాష్ట్రాలకు దీనిపై లేఖ రాస్తా'అని సీఎం రేవంత్ చెప్పారు.

# నారీ శక్తికి పట్టం కట్టేందుకే!

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన 'నారీ శక్తి వందన్'సదస్సును ఉద్దేశించి మోదీ మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ల రూపంలో ఈ శతాబ్దిలోకెల్లా అతి ముఖ్యమైన నిర్ణయాన్ని భారత్ అతి త్వరలో తీసుకోబోతోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. దాన్ని నారీ శక్తికే అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు. "మహిళా రిజర్వేషన్ల చట్టానికి రాజ్యాంగ సవరణ ద్వారా మన పార్లమెంటు కొత్త చరిత్ర సృష్టించనుంది. మనందరి జీవితకాలంలో దేశ చరిత్రలోనే అతి ముఖ్యమైన నిర్ణయంగా ఇది మిగిలిపోనుంది. మహిళా సాధికారతకు నిదర్శనంగా, వారి శక్తియుక్తులకు నిజమైన నివాళిగా నిలవనుంది. భారత్‌లో స్త్రీ పురుష సమతావాదం, సామాజిక న్యాయం కేవలం నినాదాలు కావని, రోజువారీ పని సంస్కృతి మొదలుకునిఅత్యున్నత నిర్ణయ ప్రక్రియ దాకా అన్నింట్లోనూ అవి విడదీయలేని భాగమని నిరూపించనుంది. భారత మహిళలు ఇప్పటికే పాలనలో అన్ని స్థాయిల్లోనూ నిర్ణాయక పాత్ర పోషిస్తూ తమను తాము నిరూపించుకుంటున్నారు. మున్ముందు మరిన్ని పెద్ద బాధ్యతలను సమర్థంగా నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నారు"అంటూ కొనియాడారు. లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు 2027 జనగణనతో ముడిపడి ఉన్నాయి. దాంతో ప్రస్తుత చట్టం ప్రకారం వాటిని 2034 నుంచి మాత్రమే అమలు చేయడం వీలు పడుతుంది. ఈ నేపథ్యంలో మహిళా రిజర్వేషన్లను 2029 నుంచే అమలు చేసేందుకు వీలుగా రాజ్యాంగ సవరణ చేసేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. లోక్‌సభ స్థానాల సంఖ్యను 816కు పెంచనున్న నేపథ్యంలో 273 స్థానాలు మహిళలకు రిజర్వు కానున్నాయి.

### అత్యున్నత పదవుల్లో 'ఆమె'

స్వాతంత్ర్య సంగ్రామం మొదలుకుని రాజ్యాంగ పరిషత్తు దాకా మహిళలు కీలక పాత్ర పోషిస్తూ వచ్చారని మోదీ గుర్తు చేశారు. స్వతంత్ర భారతానికి పునాదిరాయి వేయడంలో వారి పాత్ర ఎనలేనిదన్నారు. "దేశ నిర్మాణంలో కీలకమైన పాత్రలు పోషించే అవకాశం దొరికిన ప్రతిసారీ అద్భుత పనితీరుతో భారత మహిళలు నిత్యం తమను తాము నిరూపించుకుంటూనే ఉన్నారు. ఇప్పుడు రాష్ట్రపతి నుంచి కేంద్ర ఆర్థిక మంత్రి దాకా అత్యున్నత బాధ్యతలను అద్భుతంగా నెరవేరుస్తున్నారు. విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం వంటి రంగాల్లో మహిళ భాగస్వామ్యం చురుగ్గా ఉన్నచోట మెరుగైన ఫలితాలు కనిపిస్తున్నాయి. దేశవ్యాప్తంగా 14 లక్షల మందికి పైగా మహిళలు స్థానిక పాలనలో తమదైన ముద్ర వేస్తున్నారు. 21 రాష్ట్రాల్లోని పంచాయతీల్లో మహిళల భాగస్వామ్యం దాదాపు 50



శాతానికి చేరింది. ఈ ఘనతను చూసి ప్రపంచమే విస్తుపోతోంది"అంటూ ప్రధాని హర్షం వెలిబుచ్చారు.

### అన్ని పార్టీలదీ అదే ఆకాంక్ష

మహిళా రిజర్వేషన్ల బిల్లును 2023లో పార్లమెంటులో అన్ని పార్టీలూ ఏకగ్రీవంగా ఆమోదించాయని, 2029లోపే దాన్ని అమలు చేయాలని ఆకాంక్షించాయని మోదీ గుర్తు చేశారు. చర్చలు, పరస్పర సహకారం ద్వారా దీన్ని పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "దీనిపై దేశవ్యాప్తంగా మహిళల్లో పట్టరాని ఉత్సాహం కనిపిస్తోంది. లోక్‌సభ, అసెంబ్లీల్లో పెద్ద సంఖ్యలో కాలు పెట్టేందుకు వారు ఎంతో ఉత్సుకతతో ఉన్నారు. ఆ కలలకు ఇప్పుడిక రెక్కలు రానున్నాయి"అని అభిప్రాయపడ్డారు.

### గృహస్తును కాకపోయినా సాదకబాధకాలు తెలుసు!

మహిళల ఆర్థిక సాధికారత వల్ల కుటుంబాల్లో వారికి గౌరవాదరాలు పెరిగాయని మోదీ అభిప్రాయపడ్డారు. తాను గృహస్తును కాకపోయినా ఇంటిని నడపడంలోని సాదకబాధకాలు బాగా తెలుసని ఆయన చెప్పడంతో సమావేశంలో పాల్గొన్న మహిళలంతా పెద్దపెట్టున చప్పట్లతో హర్షధ్వానాలు చేశారు! "ఇల్లు మొదలుకుని వాహనం దాకా కుటుంబ ఆస్తులన్నీ గతంలో ప్రధానంగా పురుషుల పేర్లతోనే ఉండేవి. పీఎం ఆవాస్ యోజన తదితరాలతో పరిస్థితి మారింది. ఆస్తులకు మహిళలు యజమానులవుతున్నారు. గత 11 ఏళ్లలో 3 కోట్ల మందికి పైగా మహిళలు ఇంటి యజమానులయ్యారు"అని ప్రధాని అన్నారు. "గతంలో ఇళ్లలో తండ్రీ కొడుకులు వ్యాపారం గురించి చర్చించుకుంటుంటే మహిళలు వారికి చాయ్ బిస్కట్లు ఇచ్చేందుకే పరిమితమయ్యేవారు. మహిళలు ఆర్థికంగా సాధికారత సాధించడంతో ఇప్పుడు పరిస్థితులు మారాయి. వ్యాపార నిర్ణయాలకు సంబంధించి అమ్మతో కూడా చర్చిద్దామని కొడుకులు తండ్రులతో అంటున్నారు"అని చెప్పుకొచ్చారు.

# దొడ్డిదారిన డీలిమిటేషన్

## మహిళా కోటా బిల్లు ముసుగులో కేంద్రం కుట్ర

## డీలిమిటేషన్‌కు రాజకీయ ప్రాతినిధ్యాన్ని తీసుకోవాలి

## ఏఐసీసీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: మహిళా రిజర్వేషన్ల బిల్లును అడ్డంపెట్టుకుని ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటి డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) బిల్లును ఆమోదింపజేసేందుకు కుట్ర పన్నుతున్నదని ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియాగాంధీ ఆరోపించారు. ఆయా బిల్లులను విమర్శిస్తూ ఆమె రాసిన వ్యాసం సోమవారం ఓ ప్రముఖ పత్రికలో ప్రచురితమైంది. వ్యాసం ద్వారా ఆమె మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లుల విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తప్పుబట్టారు. రాజ్యాంగంపై కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తున్నదని ఆమె ఆరోపించారు. దొడ్డిదారిన డీలిమిటేషన్ చేయడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేశారు. లోక్‌సభ స్థానాల సంఖ్య పెంచేందుకు కేవలం అంకెలు, గణాంకాలను మాత్రమే పరిగణలోకి తీసుకోవడం సరికాదని, రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం అంశాన్నీ గుర్తించాలని అభిప్రాయపడ్డారు. రాజకీయ సమానత్వం పాటించేలా ప్రక్రియ జరగాలని పేర్కొన్నారు. కేవలం జనాభా ప్రతిపాదికన డీలిమిటేషన్ ప్రక్రియ చేపడితే, ఇప్పటికే జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేస్తున్న దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తరాది రాష్ట్రాలకు మాత్రం రాజకీయ ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.

### కుల గణనను అడ్డుకునేందుకే

కుల గణనను అడ్డుకునేందుకు పరోక్షంగా ప్రధాని మోదీ డీలిమిటేషన్ వ్యూహాన్ని అమలు చేస్తున్నారని సోనియాగాంధీ ఆరోపించారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందడమే బీజేపీ లక్ష్యమని పేర్కొన్నారు. 2021లో జరగాల్సిన జనాభా గణనను ఐదేళ్ల పాటు కావాలనే ఆలస్యం చేశారని మండిపడ్డారు. 2027 జనాభా లెక్కల ఫలితాల కోసం వేచి చూడకుండా, 2011 నాటి పాత లెక్కల ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేయాలనుకోవడం రాజకీయ కుట్ర అని అభివర్ణించారు. మహిళల బిల్లు పేరుతో కేంద్ర ప్రభుత్వం ఊదరగొడుతున్నదని, కేంద్ర ప్రభుత్వానికి చేతనైతే ఓబీసీ మహిళలకూ వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష సమావేశం నిర్వహించకుండా ఏకపక్షంగా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించడమేంటని నిలదీశారు.



# స్వర్గీయ శ్రీపాద రావు సేవలు మరువలేనివి..

### రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..

**(కుమారస్వామి, ప్రజాతీర్పు జగిత్యాల రూరల్) ఏప్రిల్ 13**

జగిత్యాల జిల్లా ధర్మపురి స్వర్గీయ శ్రీపాద రావు గారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. స్వర్గీయ శ్రీపాదరావు 27వ వర్ధంతి సందర్భంగా జగిత్యాల జిల్లా ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలవేసి మంత్రి లక్ష్మణ్ కుమార్ నివాళ్లులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ మారుమూల మంథని ప్రాంతంలోని ధన్వాడ గ్రామంలో జన్మించిన శ్రీపాద రావు గారు ధన్వాడ సర్పంచ్ గా, మంథని సమితి ప్రెసిడెంట్ గా , మంథని ఎమ్మెల్యేగా సేవలు అందించారని మంత్రి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గా పనిచేసి స్పీకర్ పదవికి వన్నెతెచ్చిన గొప్ప నేత శ్రీపాద రావు గారు అని అన్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా అందరితో కలివిడిగా ఉంటూ శ్రీపాద రావు గారు అజాతశత్రువుగా పేరు తెచ్చుకున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు గారు రాజకీయాల్లో రాణిస్తున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శ్రీపాదరావు వర్ధంతి సందర్భంగా ధర్మపురి ప్రజల పక్షాన వారికి నివాళులు అర్పిస్తున్నట్టు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ తో ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్లు, పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టు ముసుగులో బ్లాక్మెయిల్

**(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) ఏప్రిల్ 13**

వేములవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన బ్లాక్ మెయిల్ మరియు ఎక్స్టోర్షన్ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు, వివరాల్లోకి వెళితే తేదీ: 03-04-2026 న, వేములవాడకు చెందిన ఒక సూపర్ మార్కెట్ యజమానికి, గోడిశేల మహేష్ (గ్రా: చంద్రంపేట) అనే వ్యక్తి జర్నలిస్ట్ ముసుగులో పరిచయం ఏర్పరచుకొని, బాధితుడికి చెందిన సూపర్ మార్కెట్ పై అధికారుల తో తనిఖీలు జరిపిస్తానని మరియు పత్రికలో ప్రతికూల వార్తలు ప్రచురిస్తానని బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేసినాడు మరియు అతను కత్తి చూపించి ప్రాణహాని బెదిరింపులకు పాల్పడుతూ బాధితుని నుండి మొత్తం రూ.42,000/-ను ఫోన్ పే ద్వారా వసూలు చేసుకున్నాడు. అనంతరం మరికొంత డబ్బులు ఇవ్వాలని తిరిగి ఫోన్ చేసి బెదిరింపులకు గురి చేశాడని ఈ విషయమై బాధితుని ఫిర్యాదు మేరకు వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, విచారణలో భాగంగా, ఈ రోజు ఎస్ఐ రామ్మోహన్ గారు, మరియు కానిస్టేబుల్ గోపాల్ నిందితుడు మహేష్‌ను అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి సంబంధిత సాక్ష్యాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని గౌరవ న్యాయస్థానములో హాజరు పరచగా, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిఐ బి. వీర ప్రసాద్ మాట్లాడుతూ, నిందితుడు మహేష్ మరెవరినైనా ఇదే విధంగా బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లయితే, బాధితులు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. అలాగే, ప్రభుత్వ అధికారుల పేర్లు చెప్పి లేదా ప్రెస్ రిపోర్టర్ల ముసుగులో బెదిరింపు చర్యలకు పాల్పడే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకొనబడతాయని తెలిపారు. ఇదే తరహాలో ఎవరినైనా బెదిరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించవలెనని తెలిపారు.



# అనుపురంలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక': రోడ్డు భద్రతా కమిటీ ఏర్పాటు

**(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) ఏప్రిల్ 13:**

వేములవాడ మండలం, ?అనుపురం గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ఈరోజు అనుపురం గ్రామంలో గ్రామ సభ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో టౌన్ ఇన్‌స్పెక్టర్, ట్రాఫిక్ ఆర్.ఐ మరియు ట్రాఫిక్ ఎస్.ఐ. రాజు పాల్గొని గ్రామస్థులకు రోడ్డు భద్రతపై దిశానిర్దేశం చేశారు. ఇట్టి కార్యక్రమంలో ??రోడ్డు భద్రతా కమిటీ ఏర్పాటు, గ్రామంలో ట్రాఫిక్ నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు అధికారుల సమక్షంలో ప్రత్యేకంగా 'రోడ్డు భద్రతా కమిటీ'ని ఏర్పాటు చేయడం జరిగింది. ?ట్రాఫిక్ నియమాలపై అవగాహన: ఇటీవల జరిగిన కొన్ని రోడ్డు ప్రమాద ఉదంతాలను ఉదాహరణగా వివరిస్తూ, హెల్మెట్ ధరించడం మరియు అతివేగాన్ని నియంత్రించడం వంటి అంశాలపై అధికారులు ప్రజలను చైతన్య పరిచారు. ? రహదారి నిబంధనలను గౌరవిస్తూ, ప్రమాద రహిత గ్రామం కోసం కృషి చేస్తామని గ్రామస్థులందరితో కలిసి అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ?ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజా ప్రతినిధులు మరియు గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అన్ని వర్గాల ప్రజల కృషితోనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యం: జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

- ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం... రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్,

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఏప్రిల్ 13.**




రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం, ప్రజల్లో ట్రాఫిక్ నియమాల పట్ల బాధ్యతాభావం పెంపొందించడం లక్ష్యంగా అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ఏప్రిల్ 13 నుండి 18 వరకు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు జగిత్యాల పట్టణంలోని ఓల్డ్ బస్ స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ గారు, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ... ప్రస్తుత కాలంలో ఇతర ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రజల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వంటి అంశాలేనని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనం నడిపి, తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయని, అలాంటి సంఘటనలు కుటుంబాలకు తీరని నష్టాన్ని కలిగిస్తాయని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీస్ శాఖ చేపడుతున్న "ూతీతీఱజవ ూశ్రీఱజవ" కార్యక్రమం ప్రశంసనీయమని తెలిపారు. వాహనదారులు జాగ్రత్తగా, నియమ నిబంధనలు పాటిస్తూ ప్రయాణిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. రోడ్డు భద్రత ఒక్క పోలీస్ శాఖ బాధ్యత కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. "వేగం ప్రాణం తీస్తుంది" అనే విషయాన్ని గుర్తుంచుకుని అధిక వేగంతో ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ రఘు చందర్, ఆర్టీఓ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, ఎస్.ఐలు, మున్సిపల్ కౌన్సిలర్లు, సుమారు 300 మంది విద్యార్థులు మరియు ప్రజలు పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన పొందారు.



# ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్
- ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య :63

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఏప్రిల్ 13.**

ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపుకలెక్టర్ ఆర్డీఓలతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 63 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం 8వ పోషణ్ పక్ వాడ పోస్టర్ ఆవిష్కరించారు. ప్రధాన మంత్రి ఇంటర్న్ షిప్ పథకం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ బి.ఎస్.లత,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్, జగిత్యాల, కోరుట్ల, ఆర్డీవోలు మధు సూదన్, జీవాకర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు మరియు పాల్గొన్నారు.



# పోస్టర్ ఆవిష్కరణ... న్యాత నవీన్

**(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) ఏప్రిల్ 13**

వేములవాడ నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో, ఏప్రిల్ 18న హైదరాబాద్‌లోని ధర్మచౌక్, ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించిన వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర విప్ ఆది శ్రీనివాస్ ఏప్రిల్ 18 వ తేదీన తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబడుతోంది. ట్రంప్--ఆదాని--మోదీ మధ్య జరుగుతున్న వ్యాపార ఒప్పందాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా యూత్ కాంగ్రెస్ ఈ పోరాటాన్ని చేపడుతోంది. ఈ సందర్భంగా వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు న్యాత నవీన్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రజలను ఇంకా ఎంతకాలం మోసం చేస్తారని ప్రశ్నిస్తూ, కొద్దిమంది కార్పొరేట్ ప్రయోజనాల కోసం దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ రంగం, పాడి పరిశ్రమలను నిర్లక్ష్యం చేసి విదేశీ సంస్థలకు అనుకూల విధానాలు అమలు చేస్తున్నారని, దేశ సార్వభౌమాధికారానికి భంగం కలిగేలా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 140 కోట్ల భారతీయుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే విధానాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో దేశ ప్రజలు ఈ విధానాలకు గట్టి సమాధానం ఇస్తారని, ప్రజాస్వామ్య విలువలను కాపాడే నాయకత్వానికి మద్దతు పెరుగుతోందని పేర్కొన్నారు. ఇటువంటి ప్రజావ్యతిరేక విధానాలను యూత్ కాంగ్రెస్ ఎప్పటికీ సహించబోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కౌడగాని వెంకటేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సంఘ స్వామి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరం రాకేష్, కౌన్సిలర్ అన్నారపు శ్రీనివాస్, ముకుంద రెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ, నాగం మురళి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ ఎన్నారపు సాగర్, పసుల అనూక్, సందెల శేష్ కుమార్, అక్కి సునీల్, ఇర్ఫాన్ షేక్, మల్లారం రాజేందర్, గస్కంటీ అశోక్, మ్యాధరి జాన్, సన్నీ, అశోక్, విశ్వాస్, తదితర యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

# 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా రోడ్డు భద్రత పై గ్రామ సభ

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట) ఏప్రిల్ 13**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజులు ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేడు ఇల్లంతకుంట మండల కేంద్రంలో సర్పంచ్ వీ.రాజు మరియు గ్రామ పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా రాజన్న సిరిసిల్ల జిల్లా అడిషనల్ ఎస్పీ చంద్రయ్య మరియు ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్ హాజరయ్యారు. గ్రామ సభలో గ్రామ ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ సమస్యలు, అధిక వేగంతో వాహనాలు నడపడం, హెల్మెట్ వినియోగం, పాఠశాల విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో భద్రత వంటి అంశాలను ప్రజలు ప్రస్తావించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అధిక వేగంతో డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో, ముఖ్యంగా పాఠశాలల వద్ద మరియు జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో నెమ్మదిగా వాహనాలు నడపాలని సూచించారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఎస్సై సిరిసిల్ల అశోక్ మాట్లాడుతూ చిన్న చిన్న నిర్లక్ష్యాల వల్లే పెద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. యువత ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపకూడదని సూచించారు. రాత్రి వేళల్లో వాహనాలపై రిఫ్లెక్టర్ స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలని, ట్రాక్టర్లు మరియు ఇతర వాహనాలకు లైట్లు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సర్పంచ్ వీ.రాజు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. గ్రామంలో రోడ్డు భద్రతకు సంబంధించి ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ముఖ్యంగా పాఠశాలల పరిసర ప్రాంతాల్లో వాహనాలను నెమ్మదిగా నడపాలని, యువత ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అలాగే గ్రామంలో ఉన్న సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు గ్రామ సభలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రజాపాలన కార్యక్రమం ద్వారా గ్రామాభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని, ప్రజలందరూ ప్రభుత్వ కార్యక్రమాలకు సహకరించాలని సర్పంచ్ కోరారు. అనంతరం ఎస్సై సిరిసిల్ల అశోక్ రోడ్డు భద్రతపై గ్రామ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలో రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతుందని, ప్రజలు కూడా సహకరించాలని అధికారులు కోరారు. ఇట్టి కార్యక్రమంలో ఉపసర్పంచ్ మూగు నాగరాజ్ శర్మ, వార్డు రేగుల కార్తీక్, మామిడి సుశీల, మామిడి శ్రీనివాస్, చేరాల వంశీకృష్ణ, రాకం సుమన్, అంతటి శ్రీకాంత్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, గ్రామ పెద్దలు మరియు మహిళా సంఘాల సభ్యులు, ఆశ వర్కర్లు,అంగన్వాడీ టీచర్స్, మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఎండ దెబ్బకు చెక్ పెట్టే 'తాటి ముంజలు' గిరాకీ ఫుల్!

- జమ్మికుంటలో జోరుగా సాగుతున్న తాటి ముంజల విక్రయాలు.
- ఇందులో ఉండే సహజమైన గ్లూకోజ్, నీటి శాతం నీరసాన్ని తగ్గిస్తుంది.
- పొట్టలోని మంటను తగ్గించి, జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది.

**జమ్మికుంట, ఏప్రిల్ 13 ప్రజాతీర్పు**

భానుడి భగభగలకు జనం అల్లాడిపోతుండటంతో, వేసవి తాపాన్ని తీర్చుకునేందుకు ప్రకృతి ప్రసాదించిన 'ఐస్ యాపిల్' తాటి ముంజల వైపు జమ్మికుంట ప్రజలు మొగ్గు చూపుతున్నారు. పట్టణంలోని ఫ్లైఓవర్ కింద సిటీకేబుల్ లైన్ సమీపంలో తాటి ముంజల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. జమ్మికుంట పట్టణ కేంద్రంలో తాటి ముంజల విక్రయదారులు పెద్ద ఎత్తున ముంజలను అందుబాటులోకి తెచ్చారు. ఎండ తీవ్రత దృష్ట్యా అటుగా వెళ్లే బాటసారులు, వాహనదారులు ఆగి నిమిషాల తరబడి వేచి చూసి ముంజలను కొనుగోలు చేస్తున్నారు. విక్రయదారులు ముంజలను ఎప్పటికప్పుడు తీసి వినియోగదారులకు అందిస్తుండగా, ప్రజలు ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలు కృత్రిమ



పానీయాల కంటే తాటి ముంజలు ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. తాటి ముంజల వ్యాపారులు మాట్లాడుతూ..ఇవి కేవలం దాహాన్ని తీర్చడమే కాకుండా, శరీరానికి చలవను ఇస్తాయని వైద్యులు కూడా సూచిస్తుండటంతో ముంజలకు గిరాకీ పెరిగింది. వేసవిలో వచ్చే అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం పొందడానికి ముంజలు ఒక మంచి సహజ సిద్ధమైన ఆహారమని వారు పేర్కొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్ , ఏప్రిల్ 13 (ప్రజాతీర్పు )**

ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేసి సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ప్రభుత్వ వసతి గృహాలను నిరంతరం తనిఖీ చేయాలని తెలిపారు. అలాగే, ముఖ్యమంత్రి బాసర పర్యటనను విజయవంతంగా నిర్వహించినందుకు అధికారులను అభినందించారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించినందుకు సంబంధిత అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డా. బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ పర్యటన వివరాలు

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) ఏప్రిల్ 13**



ఉదయం 10:00 గంటలకు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తారు. ఉదయం 11:00 గంటలకు మంథని కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తారు. మధ్యాహ్నం 12:00 గంటలకు గోదావరిఖని చౌరస్తా లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తారు. మధ్యాహ్నం 1:00 గంటలకు మందమర్రి మార్కెట్ ఏరియా లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తారు. మధ్యాహ్నం 2:00 గంటలకు బెల్లంపల్లి కాంట చౌరస్తా లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తారు. మధ్యాహ్నం 3:00 గంటలకు మంచిర్యాల కేంద్రంలోని ఐబీ చౌరస్తా వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తారు. మధ్యాహ్నం 4:00 గంటలకు ధర్మారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తారు.



## గాలిపల్లి ఉప మండల హిందూ సమ్మేళన వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**(వెగ్గళం రాధాకిషన్, ప్రజాతీర్పు ఇల్లంతకుంట ) ఏప్రిల్ 13**

గాలిపల్లి గ్రామం లోని హరిహర దేవాలయం ఆవరణలో గాలిపల్లి ఉప మండల హిందూ సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షుడు మల్లు గారి దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన గోడపత్రిక,కరపత్రం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మల్లు గారి దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ అసంఘటితంగా ఉన్న హిందూ సమాజాన్ని ఏకత్రాటిపై సంఘటిత పరచాలని ఉద్దేశంతోనే హిందూ సమ్మేళన బహిరంగ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 19 తేదీ న ఆదివారం రోజున ఉదయం 9 గంటలకు హరిహర దేవాలయం లో సమ్మేళనం జరుగుతుందని తెలియజేశారు. ఈ సమ్మేళనానికి హిందూ బంధువులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖండ జాగరణ సమితి సభ్యులు ఎలిగేటి వంశీ,బత్తిని ఆంజనేయులు,తాళ్లపల్లి గ్రామ సర్పంచ్ వెంకట రామరెడ్డి,హిందూ సమ్మేళన నిర్వహణ సమితి ప్రధాన కార్యదర్శి కోమటి రెడ్డి శ్రీనివాస్, కోశాధికారి అయ్యన్న గారి హరికృష్ణ రెడ్డి, హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు చిలుముల బాలనాగచారి, మధుసూదన్ రెడ్డి, లక్ష్మణ్, మహేష్, రమణారెడ్డి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




## ప్రజా పాలన ప్రగతిపాలన

**(దండే భూమన్న ప్రజాతీర్పు మంచిర్యాల) ఏప్రిల్ 13**

నెన్నల మండలం లోని గొల్లపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రత మరియు డ్రైవింగ్ గురించి అవగాహన కల్పించడం కొరకు ప్రత్యేక గ్రామసభ సమావేశం నిర్వహించిన సర్పంచ్ జాడి లక్ష్మి ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వేల్పుల మొగిలి, వార్డు సభ్యులు లింగంపల్లి నిర్మల, చింత శారద, పంచాయితీ కార్యదర్శి సాయి తేజ, ఎస్ హెచ్ జి సి ఎ అనిల్, అంగన్వాడీ టీచర్లు రాజమణి, సుజాత, ఆశ వర్కర్ శైలజ, మాజీ సహకర సంఘం చైర్మన్ ఇందురి రమేష్, మాజీ ఉప సర్పంచ్ జాడి నారాయణ, లింగంపల్లి రాజేష్, రాజన్న, తదితరుల పాల్గోన్నారు.

## ఇల్లంతకుంట లో ప్రారంభమైన కేసీఆర్ కప్ క్రికెట్ టోర్నీ

**(వెగ్గళం రాధాకిషన్, ప్రజాతీర్పు ఇల్లంతకుంట ) ఏప్రిల్ 13**

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకుముస్కాన్ పేట శివారులో గల సింగిరెడ్డి వీరారెడ్డి గారి వ్యవసాయ భూమిలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించి మొదటగా. ఓబులాపురం-పెద్దలింగాపూర్ గ్రామాల మధ్య జరుగుతున్న క్రికెట్ టోర్నీ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిద్ధం వేణు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో క్రికెట్ ఆడాలని, ఆటల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. మండలంలోని 14 ఎంపీటీసీ స్థానాల పరిధీ నుంచి 14 జట్లను ఎంపిక చేయడం జరిగిందన్నారు.

క్రికెట్ టోర్నీ జరుగుతున్న క్రీడామైదానం వద్ద అన్నీ సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి 50000, ద్వితీయ బహుమతి 25000లు ఇవ్వడం జరుగుతుందన్నారు.



మండల స్థాయిలో క్రికెట్ టోర్నీ పూర్తి అయ్యాక మండల స్థాయిలో గెలుపొందిన జట్టును జిల్లా స్థాయిలో జరిగే క్రికెట్ టోర్నీకి పంపడం జరుగుతుందన్నారు. గ్రామీణ యువత ఎలాంటి ఆటంకాలు లేకుండా క్రీడా పోటీలలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల మాజీ అధ్యక్షుడు చేరుకుపెల్లి రాజిరెడ్డి, ఉడుతల వెంకన్న, గొడిసెల జితేందర్, వికృతి లక్ష్మ రెడ్డి, రడం ప్రవీణ్, పట్నం శ్రీనివాస్,సావనపెల్లి అనీల్, గొట్టేపర్తి పర్శరాం, ఎండి.సాదుల్ , ర్యాగటి రమేష్,ఎలవేని రమేష్, తూటి పర్శరాం, ఎంద్ర చందన్, వంశీ,ఎడ్ల ప్రశాంత్ రెడ్డి,పండుగ భాస్కర్, పండుగ రాజిరెడ్డి, పట్నం మహేందర్, సిద్ధం సాగర్, బండారి మహేందర్, ఎద్దు కుమార్, ఆళ్వాల రాజు, తోటపెల్లి తిరుపతి మరియు తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా మాస శ్రీనివాసుని కళ్యాణోత్సవం.

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఏప్రిల్ 13.**

శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ శ్రీనివాసాంజనేయ భవాని శంకర దేవాలయంలో స్వామివారి 5 వ కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతినెల శ్రవణా నక్షత్రం సందర్భంగా నిర్వహించే శ్రీ శ్రీనివాస పద్మావతి అలివేలు మంగమ్మల కళ్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. దేవాలయ ఆవరణలో ప్రత్యేకంగా అలంకరించిన కళ్యాణ మండపంలో ఉత్సవ మూర్తులను ఉంచి స్వామివారి కల్యాణాన్ని వేదమూర్తులైన బ్రాహ్మణులు అంగరంగ వైభవంగా నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంగెం సురేందర్, ఆలయ చైర్మన్ బాశెట్టి లవ కుమార్, మంచాల రాంగోపాల్, గౌరిశెట్టి రాజు, ఫౌండర్ ట్రస్టీలు గౌరిశెట్టి గణేష్, రాగి వెంకటేశం, బంగ్లా శేఖర్, వల్లాల సత్తయ్య, గౌరిశెట్టి సాధన, అనుమల్ల ఉమాభారతి, గోలి శ్రీనివాస్, మేడిపల్లి రాజన్న శర్మ, అర్చకులు రుద్రంగి శశాంక మౌళి శర్మ, రుద్రంగి గోపాల కృష్ణ శర్మ, భార్గవ శర్మ, పాల్గొన్నారు.



## ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బిజెపి నాయకుల సన్మానం

**(ఎలుక భగవాన్, ప్రజాతీర్పు, ఎండపల్లి) ఏప్రిల్ 13**

ఈనెల 12న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో బైపీసీ గ్రూపు లో కస్తూరిబా కళాశాల కరీంనగర్ లో విద్యను అభ్యసించిన ఎండపల్లి మండల కేంద్రానికి చెందిన దాసరి కొమురయ్య యాదవ్ కుమార్తె రవళి 892, దాసరి నాగరాజు యాదవ్ కుమార్తె సమత 856 మార్కులు సాధించి, ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఎండపల్లి బిజెపి గ్రామ శాఖ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం బిజెపి మండల ప్రధాన కార్యదర్శి మంచికట్ల రవి మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన విద్య సమాజ శ్రేయస్సుకు అవసరమని, ప్రభుత్వ కళాశాలలో చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు ఎండపల్లి గ్రామానికి గర్వకారణం అని అన్నారు, ఈ కార్యక్రమంలో బిజెపి గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ , మండల కార్యదర్శి మామిడిపల్లి రమేష్, వార్డు సభ్యులు దాసరి మల్లేష్, సంపతి స్వామి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మాజీ శాసనసభ్యులు దుదిల్ల శ్రీపాద రావు 27వ వర్ధంతి

**జమ్మికుంట ఏప్రిల్ 13 (ప్రజాతీర్పు)**

జమ్మికుంట గాంధీ చౌరస్తాలో మంథని మాజీ శాసనసభ్యులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రతి స్వర్గీయ దుదిల్ల శ్రీపాద రావు 27వ వర్ధంతి కార్యక్రమాన్ని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. వారు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి శాసనసభ స్పీకర్ గా ఈ ప్రాంత అభివృద్ధి కొరకై ఎంతో కృషి చేసినటువంటి వ్యక్తిగా పేరొందినటువంటి శ్రీపాద రావు ఆశయాలను కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకెళ్తాదని వారు శాసనసభ కేవన్నె తెచ్చి ఎంతోమందికి దిక్సూచిగా ఉన్నటు వంటి వ్యక్తిఅని చెప్పక తప్పదు ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మొలువురు సదయ్య,కౌన్సిలర్స్ మాచర్ల రాజు, యాట్ల సునీత, అశోక్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూరి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండి సలీం,ఎండి సజ్జు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎగ్గని శ్రీనివాస్, సలీం పాషా, పాత ప్రసాద్,చిన్నింటి నాగేంద్ర,ఆడెపు కిరణ్,చంచల శ్రీనివాస్,రాజ్ కుమార్,సందీప్ పాల్గొన్నారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27గాను అడ్మిషన్స్ ప్రారంభం

**జమ్మికుంట ఏప్రిల్ 13 (ప్రజాతీర్పు)**

జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ ఒ పీజీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరంకు గాను అడ్మిషన్ల కోసం కళాశాలలో నిర్వహించిన సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి రమేష్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిధిగా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ జాతీయ స్థాయి అర్హత గల మరియు పరిశోధన అనుభవం గల అధ్యాపకులు ఉన్నారన్నారు. అదే విధంగా, అత్యుత్తమ ప్రతిభ గల అధ్యాపకులచే ఆధునిక పద్ధతులలో విద్యాబోధన జరుగుతుందన్నారు. డే స్కాలర్స్ విద్యార్థుల కోసం మిడ్డే మీల్స్ ఏర్పాటు చేశారన్నారు. ఈ కళాశాలలో చదివే విద్యార్థిని, విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్ సౌకర్యం కలదన్నారు. విద్యార్థులు బంగారు భవిష్యత్తుకై జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ ఒ పీజీ కళాశాలలో చేరాలన్నారు. అనంతరం కళాశాల అడ్మిషన్ల కై ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు...

# రహదారి భద్రత నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలి





జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పు మంచిరాల స్టాప్ రిపోర్టర్) ఏప్రిల్ 13**

వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లాలోని హాజీపూర్ మండలం రాపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అరవై అలైవ్ కార్యక్రమానికి డిసిపి ఏ.భాస్కర్, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ సాగర్ రావు, మంచిర్యాల ఏ సి పి ప్రకాష్, జిల్లా రవాణా అధికారి, హాజీపూర్ మండల తహసిల్దార్ పుష్పలత లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నిబంధనలను పాటించాలని, ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అరైవ్ - అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ప్రతి వాహనదారుడు రహదారి భద్రత నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. వాహనదారులు జాగ్రత్తగా వాహనాలను నడపాలని, రోడ్డు ప్రమాదం అంటే ఒక కుటుంబానికి జరిగే ప్రమాదమని తెలిపారు. రహదారి భద్రత నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, ప్రభుత్వం సురక్షితమైన ప్రయాణం కొరకు రహదారులు నిర్మించిందని, ఈ క్రమంలో రహదారులపై కేజ్ వీల్స్ నడపకూడదని, నిబంధనలు ఉల్లంఘించి రహదారులకు దెబ్బతినేలా వాహనాలు నడిపినట్లైతే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి వాహనానికి సంబంధించి ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, వాహనదారులు మద్యం సేవించి, మొబైల్ వినియోగిస్తూ వాహనాలు నడపకూడదని తెలిపారు. తనిఖీలలో మద్యం సేవించి వాహనం నడుపుతూ దొరికినట్లైతే సంబంధిత వాహనదారుడి లైసెన్స్ సస్పెండ్ చేయడం జరుగుతుందని, 18 సంవత్సరాల వయసు నిండని వారు వాహనాలు నడపకూడదని, ఒకవేళ నడిపినట్లయితే వారి తల్లితండ్రులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జాతీయ రహదారులపై పరిమిత వేగాన్ని పాటించాలని, రవాణా వాహనాలు పరిమిత లోడ్ రవాణా చేయాలని తెలిపారు. పోలీస్, రవాణా శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నప్పటికీ ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వామ్యులై వాహనాలను నిబంధనలకు లోబడి జాగ్రత్తగా నడపాలని తెలిపారు. అతివేగం చాలా ప్రమాదమని, అనుభవానికి ప్రమాదానికి సంబంధం లేదని, వేగం పరిమితిలో ఉండి నిబంధనలు పాటించినట్లయితే గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవచ్చని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా, సక్రమంగా హెల్మెట్ ధరించాలని, ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు, కారులో ప్రయాణించేవారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. పరిమితికి మించి వాహనాలలో ప్రయాణికులను రవాణా చేయకూడదని, వాహనాలు నడిపే సమయంలో ఎట్టి పరిస్థితులలో మొబైల్ వినియోగించకూడదని, మద్యం సేవించి వాహనం నడపకూడదని తెలిపారు. వాహనం నడిపే సమయంలో మనం పాటించే చిన్న చిన్న విషయాలే మన ప్రాణాలను కాపాడతాయని తెలిపారు. గ్రామ సభలలో రహదారి భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రామంలో వాహనాల వేగాన్ని నియంత్రించేలా ప్రమాద ప్రాంతాలను గుర్తించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. గ్రామాలలోని అంతర్గత రహదారులపై వాహనదారులకు ఇబ్బందులు లేకుండా పారిశుధ్య నిర్వహణలో భాగంగా రహదారులను శుభ్రంగా ఉంచేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాల పంపిణీ చేశారు. అంతకుముందు మండలంలోని పద్దనపల్లి గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్యా బోధన తీరు, మధ్యాహ్న భోజన మెనూ అమలు, శుద్ధమైన త్రాగునీటి సౌకర్యాలను కల్పించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పౌష్టిక ఆహారంతో కూడిన మెనూ అమలు చేయాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సబ్బపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన 10వ తరగతి వార్షిక పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని, పరీక్ష నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు తమ విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు



## శ్రీ సత్యసాయి మందిరంలో వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం

### సత్యసాయి శత జయంతి మహోత్సవాల్లో భాగంగా భక్తిశ్రద్ధలతో వేడుకలు.

**జమ్మికుంట ఏప్రిల్ 13 (ప్రజాతీర్పు)**

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి శత జయంతి మహోత్సవాలను పురస్కరించుకొని స్థానిక శ్రీ సత్యసాయి మందిరంలో నిర్వహిస్తున్న వేడుకలు రెండో రోజుకు చేరుకున్నాయి. శ్రీ సనాతన భాగవత భక్త సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 395వ దేవతామూర్తుల మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా, సోమవారం పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సమితి కన్వీనర్ గన్ను సతీష్ కుమార్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కళ్యాణ వేడుకకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ పార్వతీ పరమేశ్వరుల వివాహ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులందరూ అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ దివ్య కళ్యాణాన్ని వీక్షించి, దేవతామూర్తులను దర్శించుకున్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షులు పి. లింగమూర్తి , రాష్ట్ర ఆధ్యాత్మిక కోఆర్డినేటర్ మహేష్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణం అనంతరం వేద బ్రాహ్మణోత్తములు భక్తులకు వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులతో పాటు, సాయి సేవాదళ్ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## రోడ్డు భద్రత పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

### – వెల్గటూర్ ఎస్సై పి. ఉదయ్ కుమార్

**(ఎలుక భగవాన్, ప్రజాతీర్పు ఎండపల్లి) ఏప్రిల్ 13 :**

రోడ్డు భద్రత నియమాలు అందరూ తప్పక పాటించాలని, రోడ్డు భద్రత పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జగిత్యాల జిల్లా వెల్గటూర్ ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ రఘు చందర్ సూచనలతో, ధర్మపురి సిఐ రాం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఎండపల్లి మండలంలోని అంబారిపేట గ్రామం లో 99 రోజుల ప్రజా పాలనలో భాగంగా రోడ్డు భద్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉదయ్ కుమార్ మాట్లాడుతూ రోడ్డు పై ప్రయాణించే ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, మద్యం సేవించి వాహనం నడుపరాదని, కారు డ్రైవింగ్ చేసేవారు సీట్ బెల్ట్ తప్పకుండ ధరించాలని, అతివేగం నివారించాలని, అలాగే మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని సూచించారు. రోడ్డు భద్రత నియమాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలుంటాయని తెలిపారు. గ్రామస్తులు, అధికారులతో కలిసి రోడ్డు భద్రత నియమాలను ఖచ్చితంగా పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలో సర్పంచ్ తో పాటు వివిధ శాఖల అధికార యంత్రాంగం, మహిళలు సభ్యులుగా రోడ్డు భద్రత(రోడ్ సేఫ్టీ) కమిటీ ఏర్పాటు చేయించారు. అనంతరం అంబారిపేట గ్రామ బస్టాండ్ నుండి ఊర్లోకి వెళ్లే రోడ్ పక్కన చెట్ల పొదల్లను, గ్రామ పంచాయతి సిబ్బందితో కలిసి బ్లేడ్ ట్రాక్టర్ తో తొలగింప చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరేష్, ఉప సర్పంచ్ శ్రీకాంత్, రోడ్లు భవనాల శాఖ అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీర్, రెవిన్యూ- ఇన్స్పెక్టర్, గ్రామ పంచాయతి కార్యదర్శి దొమ్మాటి విజయ్ కుమార్, ఆరోగ్య పర్యవేక్షకురాలు రమణ వల్లి, ఆశావర్కర్లు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## జనగణన కోసం సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్ల నియామకం పూర్తి

### జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

**మెదక్, ఏప్రిల్ 13 (ప్రజా తీర్పు ):**

జిల్లాలో జరగనున్న జనగణన కార్యక్రమానికి సంబంధించి సూపర్ వైజర్లు మరియు ఎన్యూమరేటర్ల నియామక ప్రక్రియను పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు సోమవారం హైదరాబాద్ నుండి కులగణన సంచాలకులు శ్రీమతి భారతి హోళికేరి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు నిర్వహించబడనున్న సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ముఖ్యంగా ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 1406 మంది ఎన్యూమరేటర్లు, 248 మంది సూపర్ వైజర్లను నియమించామని ఆయన వివరించారు. జనగణన ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగనన సూపరింటెంట్ గఫార్ , ఈడియం సందీప్ , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే గడ్డం వినోద్

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) ఏప్రిల్ 13**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం కన్నెపల్లి మండలంలోని జజ్జరెల్లి గ్రామపంచాయతీలో సోమవారం నిర్వహించిన క కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం చెక్కులను పంపిణీ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి, అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 36 మంది లబ్ధిదారులకు రూ.36,04,176 విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మాట్లాడుతూ,ఆడపిల్లల వివాహాల సమయంలో కుటుంబాల పై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకాల లబ్ధి అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం ఎంతో తోడ్పడుతుందని,సమాజంలో ఆడపిల్లల పట్ల గౌరవం పెరగడంలో కూడా ఈ పథకాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతను పాటిస్తూ, నిజమైన లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.అనంతరం చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కన్నెపల్లి మండలం జజ్జరెల్లి గ్రామపంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ తో పాటు ఆరుగురు వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోందని, పార్టీలో చేరిన వారికి తగిన గౌరవం, అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.మరింత మంది ప్రజలు అభివృద్ధి పథంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సృజన నర్సింగరావు, మండలానికి చెందిన ఆయా గ్రామపంచాయతీ సర్పంచులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## బోధించు - సమీకరించు - పోరాడు

- భారతదేశ ప్రజాస్వామ్యానికి పునాది ...అంబేద్కర్ రాజ్యాంగం
- వికుర్తి లక్ష్మీనారాయణ ప్రధానోపాధ్యాయుడు

**(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) ఏప్రిల్ 13:**

భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి ( ఏప్రిల్ 14 ) సందర్భంగా ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీ వేములవాడ లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వికుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ "డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాత, గొప్ప సంఘసంస్కర్త, న్యాయవేత్త మరియు ఆర్థికవేత్త అని, అంటరానితనం, కుల వివక్షపై పోరాడుతూ దళితులు, మహిళలు మరియు అణగారిన వర్గాల హక్కుల కోసం రాజ్యాంగబద్ధమైన సమానత్వాన్ని సాధించారని, ఆయన దూర దృష్టితో రూపొందించిన రాజ్యాంగం భారతదేశ ప్రజాస్వామ్యానికి పునాది అని, భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షుడిగా దేశ భవిష్యత్తుకు మార్గదర్శకమైన రాజ్యాంగాన్ని రూపొందించారని, కుల వ్యవస్థ, అంటరానితనం నిర్మూలనకు జీవితాంతం కృషి చేశారని, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడారని, మహిళలకు ఆస్తి హక్కు, సమాన హక్కుల కోసం 'హిందూ కోడ్ బిల్లు'ను సమర్థించారని, ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాల్లో చదువుకొని ఆర్థిక, న్యాయ శాస్త్రాల్లో గొప్ప జ్ఞానాన్ని సంపాదించారని, బోధించు- సమీకరించు -పోరాడు ఇది అంబేద్కర్ ఇచ్చిన నినాదమని, విద్య ద్వారా చైతన్యం, సంఘటితం ద్వారా పోరాటం అనే మార్గాన్ని చూపారని, సమానత్వం లేని సమాజం నుండి బౌద్ధమతం లోకి 1956 లో మారి, సామాజిక న్యాయానికి ఒక కొత్త మార్గం చూపారని, 1990 లో భారత ప్రభుత్వం ఆయనకు అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న'తో గౌరవించిందని" పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాలలో అపోలో కళాశాల విద్యార్థుల ప్రభంజనం

### టాపర్లను సత్కరించిన ఏసీపి సొదారపు సదానందం

**సిద్దిపేట్, హుస్నాబాద్ ఏప్రిల్13 (ప్రజాతీర్పు)**

ఆదివారం రోజున వెలువడిన ఇంటర్ పరీక్ష ఫలితాలలో హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ అపోలో వొకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఇంటర్ మీడియట్ వొకేషనల్ విభాగంలో మొదటి సంవత్సరం మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ (ఎంపిహెచ్ డబ్ల్యూ) గ్రూప్ ఆరే మాధవి 500 మార్కులకు గాను 465, ఎలక్ట్రికల్ టెక్నీషియన్(ఈటి)లో భూక్య వసంత 439, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎంఎల్ టి)లో ఎం. శ్రీ చరణ్య 390, అగ్రికల్చర్ క్రాప్ ప్రొడక్షన్ (ఎసిపి)లో కే. రాజేష్ 365, ద్వితీయ సంవత్సరంలో ఎంపిహెచ్ డబ్ల్యూ లో 1000 మార్కులకు గాను కే. సుజాత రాణి 969, ఈటీలో లింగాల ప్రవీణ్ 958, ఎల్ఎండిటి లో జి. మహేందర్ 918, ఎసిపిలో బి. శ్రీకర్ 909, ఎంఎల్ టి లో సిహెచ్. శివ 836 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన



కళాశాల విద్యార్థులను హుస్నాబాద్ ఏసిపి సొదారపు సదానందం పుష్ప గుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ విద్యార్థులు ఇదే ఫలితాలను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత చదువుల్లో మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోదించాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ వేముల గణేష్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదిగి కన్న తల్లితండ్రులకు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు, చదువుకున్న విద్యాలయాలకు మంచి పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సమత వేముల లతో పాటు అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరులో నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఘన సన్మాన సభ

- మంత్రుల సమక్షంలో మార్కెట్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

**పటాన్ చేరు, ఏప్రిల్ 13 (ప్రజాతీర్పు)**



పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతనంగా ఏర్పాటైన సందర్భంగా, పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పటాన్‌చెరు మార్కెట్ ప్రాంగణంలో ఘనంగా సన్మాన సభ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు దామోదర్ రాజనరసింహ తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాస్త్ర శాఖ మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి ౦+××జ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొని, మార్కెట్ కమిటీ నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి వారిని ఘనంగా సన్మానించారు.నూతనంగా ఏర్పాటైన మార్కెట్ కమిటీకి శివానందం చైర్మన్‌గా, రాజశేఖర్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. కమిటీ సభ్యులుగా బిక్షపతి, మైపాల్, నాగరాజు, నర్సింలు, బాలరాజ్, ఈశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, సతీష్ కుమార్ గౌడ్, ఇమ్రాన్, సునీత, హమీద్, సామయ్య, మల్లయ్య, గోపాల్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ఈనెల 20 న జగిత్యాల లో కేసీఆర్ బహిరంగ సభ

**ఎలుక భగవాన్, ఎండపల్లి, ప్రజాతీర్పు, ఏప్రిల్ 13 :**

ఈనెల 20న జగిత్యాల లో కెసిఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎండపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సింహాచలం జగన్ పిలుపునిచ్చారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు ఎండపల్లి మండలం రాజరాంపల్లి లో భారాస పార్టీ సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు సింహాచలం జగన్ మాట్లాడుతూ ఈనెల 20న జగిత్యాలలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయడం కోసం,అలాగే మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్న సందర్భంగా మండలం లోని అన్ని గ్రామాల నుండి పార్టీ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో బహిరంగ సభకు హాజరై విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ గాజుల మల్లేశం, సర్పంచ్ గాదం భాస్కర్,ఉప సర్పంచ్ మెరుగు జానీ, తెలంగాణ ఉద్యమకారులు,పార్టీ సీనియర్ నాయకులు అల్లే వెంకటేష్ యాదవ్, ఉప్పు రాజయ్యా, గంధం తిరుపతి, గంధం తిరుపతి, పడిదం నారాయణ, ఎండి. రియాజ్,గంధం లక్ష్మీనారాయణ, పడిదం వెంకటేష్, కోడి గంగయ్య, గాజుల వెంకటేష్, గంధం రవి, నాయకులు చెల్పూరి లచ్చయ్య, శేరే శ్రవణ్, అల్లంల శేఖర్ యాదవ్, తనుగుల జగతి, కొమ్ము సంజీవ్ యాదవ్, ముక్తి చందు, ఇప్పల రాజు, దేవి నరేష్, నలువాల అరవింద్, మెరుగు జంపయ్య, ముక్తి మహేష్ లతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యేను ఆహ్వానించిన అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ..

**హుస్నాబాద్ ఏప్రిల్13 (ప్రజాతీర్పు)**

హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ సోమవారం నాడు హుస్నాబాద్‌లో శుభకార్యానికి విచ్చేసిన సందర్భంగా నేడు హుస్నాబాద్ లో నిర్వహించనున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలకు హాజరుకావాలని ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. హుస్నాబాద్ మున్సిపల్ పట్టణంలో నిర్వహించనున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ బత్తుల చంద్రమౌళి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు కలిసి హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ ను మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎం.ఏ. అన్వర్, మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడబోయిన తిరుపతి రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లు గాదెపాక రవీందర్, వాలా సుప్రజ నవీన్ రావు, బొల్లి శ్రీను, గడిపే సతీష్, నాయకులు బత్తుల జగ్జీవన్, చిత్తారి శ్రీనివాస్, వికాస్, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్, అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.



## రోడ్డు నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత

హుస్నాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీను

**సిద్దిపేట్, హుస్నాబాద్ ఏప్రిల్13 (ప్రజాతీర్పు)**

హుస్నాబాద్ మండలంలోని పొతారం గ్రామంలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా సోమవారం ట్రాఫిక్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హుస్నాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీను హాజరై గ్రామస్తులకు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీ ఐ శ్రీను మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనల పట్ల కనీస అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది ప్రాణ రక్షణ కవచంలా పనిచేస్తుందని తెలిపారు. వాహనం నడిపేటప్పుడు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని , మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల తన ప్రాణంతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. వయస్సు నిండని పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, తల్లిదండ్రులు ఈ విషయంలో బాధ్యతగా ఉండాలని సీ ఐ సూచించారు. ప్రమాద రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ ఐ లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ , ఉప సర్పంచ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, పోలీసు సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## 12 ఏళ్లుగా హెల్మెట్ అలవాటు... గ్రామానికి ఆదర్శంగా నిలిచినా రాములు

**మెదక్, ఏప్రిల్ 13 (ప్రజా తీర్పు ):**



నంద గోకుల్ గ్రామానికి చెందిన రాములు (80) అనే వ్యక్తి గత 12 సంవత్సరాలుగా ద్విచక్ర వాహనం నడిపే ప్రతిసారి హెల్మెట్ ధరించడం ద్వారా ఆదర్శంగా నిలుస్తున్నారు. చిన్న దూరం అయినా, పెద్ద ప్రయాణం అయినా భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ఆయన నిరంతరం హెల్మెట్ వినియోగాన్ని కొనసాగిస్తున్నారు. రోడ్డు భద్రతపై ఆయన చూపుతున్న చిత్తశుద్ధి గ్రామస్థులకు ప్రేరణగా మారింది. ఈ సందర్భంగా నిర్వహించిన "అరైవ్ అలైవ్" అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు రాములను అభినందించారు. హెల్మెట్ వినియోగంలో క్రమశిక్షణ పాటిస్తున్నందుకు శాలువాతో సన్మానించి, మెమెంటో అందజేశారు. ప్రాణరక్షణలో హెల్మెట్ కీలకమని, ప్రతి ఒక్కరూ రాములను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఇటువంటి వ్యక్తుల వలన సమాజంలో చైతన్యం పెరుగుతుందని పేర్కొన్నారు.

# రోడ్ల పనుల పై నిర్లక్ష్యం విడండి... చొరవ చూపండి

మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు...

**సిద్దిపేట ఏప్రిల్ 13 (ప్రజాతీర్పు)**



సిద్దిపేట నియోజకవర్గం లో గత ప్రభుత్వం లో రోడ్లు మంజూరు అయి అర్ధాంతరంగా ఆగిపోయాని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు.. సిద్దిపేట క్యాంప్ కార్యాలయం లో ఆర్ అండ్ బి ఎస్ ఈ, ఈఈ, ఎ ఈ లతో పెండింగ్ పనుల పై సమీక్ష నిర్వహించారు.. ఒక కొత్త రోడ్డు పనులు లేవు పాత రోడ్లు గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం లో మంజూరు అయిన రోడ్లు అర్ధాంతరంగా ఆగిపోయి మోచేతి లోతు గుంతలతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే చొరవ చూపి రోడ్ల పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.. సిద్దిపేట రింగ్ రోడ్డు పనులు 80% శాతం పూర్తి అయ్యాయని మిగతా 20% గుంతల మయం అయి రాత్రి పూట ప్రమాదాలు జరిగి చనిపోతున్నారని పాలమాకుల, విఠల పూర్ గ్రామాల వద్ద పనులు కాకా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.. రింగ్ రోడ్ పనులు పూర్తి చేయాలని కోరారు. సిద్దిపేట నుండి చిన్నకోడూరు మండల కేంద్రం మీదుగా ఇల్లంతకుంట వరకు ఫోర్ లైన్ రోడ్డు గత ప్రభుత్వం లో మంజురు అయిన రోడ్డు 70% పూర్తి అయింది ఈ ప్రభుత్వం వచ్చిన రోజు ఆగిపోయింది ఇప్పటికీ అదే పరిస్థితిలో ఉంది రెండేళ్ల మూడు నెలల నుండి కనీసం తట్టెడు మట్టి పోయకపోవడం వల్ల ప్రజలు దుమ్మి ,ధూళి ,ప్రమాదా లతో ఇబ్బంది పడుతున్నారన్నారు.. ఎల్లమ్మ గుడి వద్ద, లింగారెడ్డి పల్లి గ్రామం వద్ద చిన్నకోడూరు చౌడారం జంక్షన్ వద్ద గుంతల మయంగా మారిందని చెప్పారు.. సిద్దిపేట ఇల్లంతకుంట రోడ్డు పై దృష్టి పెట్టాలని పనులు జరిగేల చొరవ చూపాలన్నారు. రామంచ సిరిసిల్ల రోడ్డు పనులు జరగక రోడ్డు ఇబ్బంది గా మారిందని పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. బుస్సా పూర్ ఇర్కోడ్ రాంపూర్ రోడ్డు పనులు వెంటనే ప్రారంభం చేయాలని చెప్పారు.. నంగునూర్ మండలం లో సి ఆర్ ఎఫ్ నిధులతో మంజురు అయిన ముంద్రాయి - ఆంక్షాపూర్ నాగరాజు పల్లి రోడ్డు మంజూరు అయింది.. 70% పనులు పూర్తి అయింది.. బిటి ఫైనల్ లేయర్ పనులు రెండు సంవత్సరాలనుండి ఆగిపోయాయి దాన్ని పూర్తి చేయాలని, అదేవిదంగా దర్గపల్లి బ్రిడ్జ్ పనులు వెంటనే పూర్తి చేయాలని కోరారు..




## సహస్ర"హై స్కూల్ కు మరింత వన్నె చేకూరింది

- విద్యార్థులకు ప్రధమ బహుమతిగా పదివేల రూపాయలను, ద్వితీయ బహుమతిగా ఐదు వేలరూపాయలు,
- ప్రముఖ కాంగ్రెస్ నేత,దరిపల్లి చంద్రం,,,

**సిద్దిపేట, ఏప్రిల్ 13 (ప్రజాతీర్పు )**


"సహస్ర" మరో ముందడుగు వేసింది. "సహస్ర" కిరీటానికి మరింత వన్నె చేకూరింది. సహస్ర స్కూల్ మరియు అల్లెన్ సంయుక్తంగా గతనెల మార్చి 29వ తేదీన టాలెంట్ టెస్ట్ ని నిర్వహించింది. ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ టాలెంట్ టెస్ట్ లో సహస్ర స్కూల్ విద్యార్థులతో పాటు పలు పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకొని పరీక్ష రాశారు. ఈ నేపథ్యంలో సహస్రపాఠశాలలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కాంగ్రెస్ నేత, శ్రీ దరిపల్లి చంద్రం, సహస్ర స్కూల్ కరస్పాండెంట్ శ్రవణ్, డైరెక్టర్ హారిక, ప్రిన్సిపాల్ రాఘవేందర్ మరియు అల్లెన్ ఇన్స్టిట్యూట్ కి చెందిన సౌత్ ఇండియా అధినేత నాగార్జున, స్టేట్ హెడ్ శౌరితో పాటు తల్లిదండ్రులు మరియు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సహస్ర స్కూల్ సాధించిన విజయాలతో పాటు అల్లెన్ ఇన్స్టిట్యూట్ తో విలీనం కావడాన్ని సంతోషిస్తూ, తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఎలా మలుచుకోవాలి, చదువు పట్ల శ్రద్ధ ఎలా పెట్టాలి, ఏ విధంగా వారిని ప్రోత్సహించాలి అనే విషయాలపై చక్కగా వివరించారు. అలాగే ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం కావడానికి సహకరించిన తల్లిదండ్రులకు, యాజమాన్యం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. అనంతరం టాలెంట్ టెస్ట్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రధమ బహుమతిగా పదివేల రూపాయలను, ద్వితీయ బహుమతిగా ఐదు వేల రూపాయలను సహస్ర స్కూల్ యాజమాన్యం బహుమతిగా అందజేశారు. ఐదవ తరగతిలో పారిపల్లి అద్వైతారెడ్డి, చైత్ర మారెడ్డి ప్రథమ,ద్వితీయ బహుమతులను, ఆరవ తరగతిలో కొర్ర ప్రణవ్ చౌహాన్ (ఎస్ఎచ్ఎస్), అక్షజ్ వంగపల్లి ప్రథమ, ద్వితీయ బహుమతులను, ఏడవ తరగతిలో కె. అశ్విత్ రెడ్డి, శ్రీజ బస్వరాజుల ఎస్ ఎచ్ ఎస్ ప్రథమ, ద్వితీయ బహుమతులను, ఎనిమిదో తరగతిలో గజ్జెల అర్జున్ రెడ్డి, పోతుగంటి ద్రోణ ప్రథమ, ద్వితీయ బహుమతులను గెలుచుకొని విజేతలుగా నిలిచారు.




## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం

**సిద్దిపేట, హుస్నాబాద్ ఏప్రిల్13 (ప్రజాతీర్పు)**

హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం, చివరి సంవత్సరం విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు ఫేర్ వెల్ ప్రోగ్రాంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి మాట్లాడుతూ... డిగ్రీ కళాశాలలోమూడు సంవత్సరాలు పాటు కలిసి తిరిగిన అనుబంధాన్ని, మధుర అనుభవాలను ఎల్లావేళలా గుర్తుపుట్టుకోవాలని సూచించారు. కళాశాలను వదిలిపెట్టడం విద్యార్థులకు కొంత బాధాకరంగానే ఉన్నప్పటికీ పై చదువులు చదువుకొని, మంచి ఉద్యోగం ఉపాధి పొంది సమాజ సేవ చేయడానికి కృషి చేయాలని డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులను కోరారు. కళాశాలలో ఉన్నన్ని రోజులు చాలా సంతోషంగా గడిపిన చివరి సంవత్సరం విద్యార్థులు, ఒక్కసారిగా అందరినీ విడిచి పోతున్నందుకు కొంత ఉద్వేగానికి లోనయ్యారు. వేదికమీదకు వచ్చి కళాశాలతో, అధ్యాపకులతో తమ అనుభవాలను జూనియర్ విద్యార్థులతో పంచుకున్నారు. జూనియర్ విద్యార్థులకు బాగా చదువుకోవాలని దశానిర్దేశం చేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఆటపాటలతో విద్యార్థులు సంతోషంగా కార్యక్రమాన్ని ఆసాంతం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మొదటి మరియు రెండవ సంవత్సరం విద్యార్థులు నిర్వహించగా, కళాశాల అధ్యాపకులు అనిల్ కుమార్, బాలరాజు, చంద్రమౌళి, విజయ, ఫాతిమా, నాయనా దేవి, సుధామాధురి, కుమారస్వామి, రాజ్యలక్ష్మి, లక్ష్మి, శ్రీనివాస్, చుక్కా, మజీద్, రాజయ్యా, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్,

**సిద్దిపేట, ఏప్రిల్ 13 (ప్రజాతీర్పు)**

సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారులతో ఎసిఎల్బి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని. బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజావాణిలో భూ సంబంధిత, హౌసింగ్, ఆసరా పింఛన్ల మరియు ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన 235 అర్జిలను ఆయన స్వీకరించారు. అర్జిదారులకు న్యాయం చేసి తిరిగి అర్జి పెట్టుకోకుండా సకాలంలో సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ నాగరాజమ్మ, ఏఓ రాజ్ కుమార్ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు



# పల్లెలకు శోభ తెస్తున్న ఇందిరమ్మ ఇండ్లు

### మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు గౌడ్

**పెగడపల్లి, ఏప్రిల్ 13 (ప్రజాతీర్పు)**

పెగడపల్లి మండలంలోని రామ్ భద్రుని పల్లి గ్రామంలోనిరాయవేని రేణుక వెంకటేష్, ఆరవెల్లి లో రాచకొండ సరోజన దేవయ్య లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లును నిర్మాణంపూర్తి చేసుకోగా ఈరోజు స్థానిక సర్పంచ్ కాసవేణి కుమార్ తో కలిసి గృహప్రవేశం ప్రారంభోత్సవం చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎద్దు కృష్ణ హౌసింగ్ ఏఈ జ్యోతి పంచాయతీ కార్యదర్శి హేమంత్ మండల నాయకులు ఓరుగల శ్రీనివాస్ బండారు శ్రీనివాస్ కడారి తిరుపతి పల్నాటి నవీన్ కుమార్ రాయమల్లు లింగంపల్లి మహేష్ ఐలేని వంశీధర్ రావు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# సమాజ మార్పుకు చిహ్నం బాబాసాహెబ్

### 135వ అంబేద్కర్ జయంతి ప్రత్యేకం..

**హుస్నాబాద్ ఏప్రిల్13 (ప్రజాతీర్పు)**



భారత సమాజాన్ని నిరంతరం నడిపిస్తున్న మహాశక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని ఆయన భావాలకు మరణం లేదని ఇప్పుడు ప్రతి నోట వినిపిస్తున్న మాట ప్రతీ ఏట ఏప్రిల్ 14వ తేదీన బాబాసాహెబ్ డాక్టర్ భీమ్‌రావు అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించడానికి దేశ వ్యాప్తంగా ఊరూ వాడా సిద్ధమవుతున్నాయి.బాబాసాహెబ్ అంబేద్కర్ మధ్యప్రదేశ్ లోని మోవ్‌లో 1891 ఏప్రిల్ 14వ తేదీన చివరి సంతానంగా వారి తల్లిదండ్రులకు జన్మించారు.తండ్రి సుబేదార్ రామ్‌జీ మాలోజీ సక్పాల్,అతను బ్రిటిష్ సైన్యంలో పనిచేశారు.బీఆర్ అంబేద్కర్ తండ్రి సెయింట్ కబీర్ అనుచరుడు.అతని తండ్రి పదవీ విరమణ చేసినప్పుడు అంబేద్కర్‌కు దాదాపు రెండు సంవత్సరాలు మాత్రమే అతనికి ఆరేళ్ల వయసులో తల్లి చనిపోయింది.అనంతరం అతని అత్త ఆయనను పెంచింది.ఇక విద్యాభ్యాసం విషయానికొస్తే బీఆర్ అంబేద్కర్ సతారాలో పాఠశాల విద్యను పూర్తి చేశారు.బాబాసాహెబ్ ప్రాథమిక విద్యాభ్యాసం బొంబాయిలో పూర్తయింది.మెట్రిక్యులేషన్ తర్వాత చిన్న వయసులోనే 1906లో వివాహం చేసుకున్నారు.దాదాపు 15 సంవత్సరాల వయసులో తొమ్మిదేళ్ల బాలిక అయిన రమాబాయిని వివాహం చేసుకున్నారు.ఆ సమయంలో అమలులో ఉన్న ఆచారం ప్రకారం తల్లిదండ్రులు ఈ వివాహాన్ని ఏర్పాటు చేశారు.ఆ తర్వాత ఎల్ఫిన్‌స్టోన్ కాలేజీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసారు.గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక బరోడా ఇన్‌స్టిట్యూట్‌లో చేరారు.తదుపరి చదువుల కోసం లండన్ వెళ్లారు.న్యాయశాస్త్రాన్ని అభ్యసించడానికి గ్రేస్ ఇన్‌లో చేరారు.లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీని పూర్తి చేశారు.జర్మనీలోని బాన్ యూనివర్సిటీలో కొంతకాలం చదువుకున్నారు.అనంతరం 1924లో ఇంగ్లండ్ నుంచి తిరిగి వచ్చిన తరువాత అణగారిన వర్గాల సంక్షేమం కోసం ఒక సంఘాన్ని ప్రారంభించారు.దీనికి సర్ చిమన్‌లాల్ సెతల్వాడ్ అధ్యక్షుడిగా,డాక్టర్ అంబేద్కర్ చైర్మన్‌గా ఉన్నారు.విద్యను వ్యాప్తి చేయడం,ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడం,అణగారిన వర్గాల వివక్షను దూరం చేయడం ఈ సంఘం ప్రధాన లక్ష్యాలుగా ఉండేవి.ఈ నేపథ్యంలోనే అణగారిన వర్గాల సమస్యలను పరిష్కరించడానికి "బహిష్కృత్ భారత్ వార్తాపత్రిక"1927 ఏప్రిల్ 3న ప్రారంభించారు.ఆ తర్వాత 1928లో బొంబాయిలోని ప్రభుత్వ న్యాయ కాలేజీలో ప్రొఫెసర్‌గా చేరి 1935న జూన్ 1వ తేదీన అదే కాలేజీకి ప్రిన్సిపాల్‌గా పనిచేసి 1938లో రాజీనామా చేసే వరకు అదే పదవిలో కొనసాగారు.1936లో ఇండిపెండెంట్ లేబర్ రాజకీయ పార్టీని స్థాపించారు.'ది యానిహిలేషన్ ఆఫ్ కాస్ట్' అనే పుస్తకంలో అంబేద్కర్ హిందూ మత పెద్దలను,కుల వ్యవస్థను తీవ్రంగా విమర్శించారు.వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో కార్మిక శాఖ మంత్రిగా కూడా ఆయన పనిచేశారు.స్వాతంత్ర్యం అనంతరం 1947లో దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తొలి మంత్రివర్గంలో న్యాయ శాఖ మంత్రిగా నియమితులయ్యారు.స్వాతంత్ర్యం అనంతరం అంబేద్కర్ కాంగ్రెస్ నేతృత్వంలో మొదటి న్యాయ శాఖ మంత్రిగా పని చేశారు.రెండు వారాల తరువాత ఆయన భవిష్యత్ భారత గణతంత్ర రాజ్యానికి రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు.ఆ క్రమంలో ఆయన రాజ్యాంగ సభ ముసాయిదా కమిటీకి చైర్మన్‌గా నియమితులయ్యారు.డాక్టర్ అంబేద్కర్ ప్రధానంగా సమానత్వం,సామాజిక న్యాయం,అంటరానితనం వంటి దళితుల హక్కుల కోసం పోరాడారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అత్యంత ప్రతిభావంతుడు.ఆయన దాదాపు 64 సబ్జెక్టులలో మాస్టర్స్ డిగ్రీలు సాధించారు.ఆయన 9 భాషలలో ఇంగ్లిష్,ఫ్రెంచ్,జర్మన్,మరాఠీ,పర్షియన్,గుజరాతీ, హిందీ,పాళీ, సంస్కృతం అనర్గళంగా మాట్లాడగలిగేవారు.సుమారు 21 సంవత్సరాల పాటు ప్రపంచమంతా తిరిగి అంబేద్కర్ విద్యాభ్యాసం చేశారు."డాక్టరేట్ సాధించిన తొలి భారతీయుడిగా కూడా బీఆర్ అంబేద్కర్‌కు గొప్ప గుర్తింపు ఉంది." బీఆర్ అంబేద్కర్ "వెయిటింగ్ ఫర్ వీసా" పేరుతో రాసిన ఆటో బయోగ్రఫీని కొలంబియా యూనివర్సిటీలో పాఠ్యపుస్తకంగా వినియోగిస్తున్నారు.ఇప్పటివరకు లండన్ మ్యూజియంలో కార్ల్‌మార్క్స్ విగ్రహంతో పాటు ఏర్పాటు చేసిన ఏకైక భారతీయుడి విగ్రహం బీఆర్ అంబేద్కర్‌దే కావడం దేశానికి గర్వమే. బుద్ధ భగవానుడు కళ్లు తెరిచి చూస్తున్నట్టుగా ఉండే పెయింటింగ్‌ను వేసిన తొలి వ్యక్తిగా కూడా అంబేద్కర్‌కు గుర్తింపు ఉన్నది.అంతకుముందు ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లో బుద్ధుడు కళ్లు మూసుకుని ఉన్న ఫొటోలే కనిపించేవి.వెనుకబడిన కులాల నుంచి న్యాయవాదిగా ఎదిగిన తొలి వ్యక్తిగా కూడా అంబేద్కర్ గుర్తింపు దక్కించుకున్నారు.భీమ్ రావు అంబేద్కర్ అసలు ఇంటిపేరు అంబావడేకర్.అదే ఆ తర్వాత అంబేద్కర్‌గా మారింది.తాగునీటి కోసం సత్యాగ్రహం చేసిన ఏకైక వ్యక్తి బీఆర్ అంబేద్కర్.1954లో నేపాల్ రాజధాని ఖాట్మండులో జరిగిన 'జగతిక్ బుద్ధిజం కౌన్సిల్'లో బౌద్ధ గురువులు బీఆర్ అంబేద్కర్‌ను 'బోధిసత్వ' పేరుతో సత్కరించారు.బతికుండగానే ఆయన ఆ గౌరవాన్ని పొందడం గొప్ప విషయం. అంబేద్కర్ పుట్టినరోజు వేడుకలను బహిరంగంగా నిర్వహించిన తొలి వ్యక్తి జనార్దన్ సదాశివ్ రనపిసే.ప్రజల నడుమ అంబేద్కర్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు.పింగళి వెంకయ్యతో జాతీయ పతాకాన్ని రూపొందింపజేసిన ఘనతోపాటు,జాతీయ చిహ్నంలో అశోకచక్రానికి చోటు కల్పించిన ఘనత కూడా బీఆర్ అంబేద్కర్‌కే దక్కుతుంది.తమ యూనివర్సిటీలో డాక్టరేట్ సాధించిన ప్రపంచ ప్రముఖులలో టాప్-100 పేర్లతో 2004లో కొలంబియా యూనివర్సిటీ ఒక జాబితాను రూపొందించింది.ఆ జాబితాలో అంబేద్కర్ పేరు మొదటి స్థానంలో ఉన్నది.కానీ 1951లో కశ్మీర్ సమస్య,భారత విదేశాంగ విధానం,హిందూ కోడ్ బిల్లుకు సంబంధించి ప్రధాని నెహ్రూ విధానంతో విభేదాలు వ్యక్తం చేస్తూ మంత్రి పదవికి రాజీనామా చేశారు.అతను అక్టోబర్ 14,1956న నాగపూర్‌లో జరిగిన ఒక చారిత్రాత్మక కార్యక్రమంలో బౌద్ధమతం స్వీకరించారు.1948 నుంచి మధుమేహంతో బాధపడుతున్న బాబా సాహెబ్ అంబేద్కర్ 1956 డిసెంబర్ 6వ తేదీన ఢిల్లీలో నిద్రలోనే మరణించారు.

**వ్యాసకర్త:వేల్పుల మహేందర్. ఎం ఎస్సీ,ఎంఏ ఎంఇడి, 2026-అంబేద్కర్ నేషనల్ అవార్డు గ్రహీత.**

# డంపింగ్ యార్డ్ పై ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు గ్రామ సభలు పెట్టండి

- డంపింగ్ యార్డ్ ఏర్పాటు ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించం
- అఖిలపక్షంతో భారీ ఆందోళనలు చేపడతాం
- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**హుజురాబాద్, ఏప్రిల్ 13 (ప్రజాతీర్పు)**



హుజురాబాద్ పట్టణంలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరాహార దీక్ష 22వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దీక్షలో హుజురాబాద్ క్లబ్ సభ్యులు పాల్గొనగా, వారికి హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ప్రజలు 22 రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ కోసం సుమారు 500 ఎకరాల భూమి సేకరించినట్లు సమాచారం ఉందని, వెంటనే ఈ ప్రాంతం నుంచి డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సుడా చైర్మన్ హుజురాబాద్ ప్రజలు డంపింగ్ యార్డ్ కావాలని కోరుకుంటున్నారని చెబుతున్నారని, నిజంగా ప్రజలు కోరుకుంటున్నారో లేదో తెలుసుకోవాలంటే గ్రామ సభ ఏర్పాటు చేసి ప్రజల అభిప్రాయం తెలుసుకోవాలని అన్నారు. గ్రామ సభలో ప్రజలే వాస్తవ పరిస్థితిని వెల్లడిస్తారని, ప్రజలే మీకు బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోకపోతే జేఏసీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. డంపింగ్ యార్డ్ వల్ల 9 మండలాల ప్రజల ఆరోగ్యం, పర్యావరణంపై తీవ్ర ప్రభావం ఉంటుందని పేర్కొంటూ, ఆ మండలాల ప్రజలందరినీ ఏకం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. అఖిలపక్షం ఏర్పాటు అనంతరం లక్ష మందితో భారీ ధర్నా నిర్వహిస్తామని, ఈ ప్రాంతం నుంచి డంపింగ్ యార్డ్ తొలగించే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. మా ప్రభుత్వం లేదా మా పాలక వర్గం ఉన్నప్పుడు ఈ ప్రతిపాదనకు అంగీకరించి సంతకం చేసినట్టు నిరూపిస్తే దేనికి ఇన సిద్ధం అని సవాల్ విసిరారు. లేనిపక్షంలో తమ పై ఆరోపణలు చేస్తున్న వారు తమ పదవులకు రాజీనామా చేసి హుజురాబాద్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి అని డిమాండ్ చేశారు. ఈనెల 19న డంపింగ్ యార్డ్ ప్రాంతంలో నిర్వహించనున్న మల్లన్న పట్నాలు కార్యక్రమానికి ప్రజలు భారీ ఎత్తున పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వెంట నాయకులు బండ శ్రీనివాస్, గందే శ్రీనివాస్ పోరెడ్డి శంతన్ రెడ్డి, ప్రతాప తిరుమల్ రెడ్డి కొండల్ రెడ్డి, ప్రతాప క్రిష్ణ, లావణ్య, నరేష్, తాళ్లపల్లి శ్రీనివాస్, ఆర్కే రమేష్ ధనవర్ష రాజు, ప్రభాకర్ రావు, సర్పంచులు మల్లారెడ్డి, రామారావు, క్లబ్ మెంబెర్స్ మోహన్ రావు, చింత శ్రీనివాస్, కళ్యాణ్ రావు, అరుణ్, విరసేన రెడ్డి, భగవాన్ రెడ్డి విజయ రెడ్డి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



# విద్యుత్ కార్మికుల సమ్మెపై మంత్రి పొన్నం నిర్లక్ష్యం..!

- హుస్నాబాద్ బీఎస్పీ, బిఆర్ఎస్ నాయకుల తీవ్ర విమర్శలు..
- కాంగ్రెస్ పార్టీ హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్..
- ఔట్ సోర్సింగ్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలి..
- విద్యుత్ కార్మికులకు పర్మినెంట్ ఉద్యోగాలు, అమలు చేయాలి..

**సిద్దిపేట్, హుస్నాబాద్ ఏప్రిల్13 (ప్రజాతీర్పు)**

హుస్నాబాద్ పట్టణంలోని విద్యుత్ శాఖ డి.ఈ కార్యాలయం ముందు గత ఆరు రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న విద్యుత్ ఆర్టిజన్లు, ఎస్‌పీఎం కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, స్టోర్ హమాలీలు, విలేజ్ వర్కర్ల సమ్మెకు హుస్నాబాద్ బీఎస్పీ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీఎస్పీ, బిఆర్ఎస్ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్ వైఖరిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కార్మికులు ఇంతకాలంగా నిరసన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బీఎస్పీ పార్టీ తరఫున హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం విద్యుత్ ఆర్టిజన్లకు ఏపీఎస్ఈబీ ఉద్యోగులకు ఉన్న అన్ని ప్రయోజనాలు కల్పించాలని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో మిగిలిపోయిన 23 వేల ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించినప్పటికీ ఇంకా 136 మంది మిగిలి ఉన్నారని, వారిని వెంటనే ఆర్టిజన్లుగా గుర్తించాలని కోరారు. అలాగే విద్యుత్ సంస్థల్లో సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ ఉద్యోగులుగా మార్చి జీవో నంబర్ 11 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.బిఆర్ఎస్ నాయకులు బుర్ర వెంకన్న గౌడ్ మాట్లాడుతూ విద్యుత్ కార్మికులకు పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలని కోరారు.సామాజిక కార్యకర్త వడ్డేపల్లి మల్లేశం మాట్లాడుతూ అర్హులైన కార్మికులను దశలవారీగా ఆర్టిజన్లుగా కన్వర్ట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్, బీఎస్పీ నాయకులు,విద్యుత్ కార్మిక సంఘం నాయకులు పప్పు వెంకటేశ్వర్లు, గొర్ల కుమార్ యాదవ్, బోయిని సమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా బీసీ రిజర్వేషన్ల ప్రదాత బి పి మండల్ వర్ధంతి

### బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘన నివాళులు

**సిద్దిపేట్, హుస్నాబాద్ ఏప్రిల్13 (ప్రజాతీర్పు)**

హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా లో మండల్ కమిషన్ రూపశిల్పి, బీసీ రిజర్వేషన్ల ప్రదాత బీపీ మండల్ 44వ వర్ధంతిని బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ దండి లక్ష్మి మాట్లాడుతూ... బీపీ మండల్ బీసీ లకు 27 శాతం రిజర్వేషన్స్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో కల్పించిన గొప్ప మహనీయుడని, అసెంబ్లీ, పార్లమెంట్ లలో బీసీ లకు రిజర్వేషన్స్ కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారని గుర్తు చేశారు. సింగిల్ విండో మాజీ ఛైర్మన్ బోలిశెట్టి శివయ్య మాట్లాడుతూ.. చట్ట సభలలో బీసీ లకు రిజర్వేషన్ లు కల్పించాలని, బీసీ లు ఉన్నత చదువు లు చదవాలని, రాజకీయంగా ముందుకు రావాలన్నారు. జేఏసీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ మాట్లాడుతూ... అభినవ అంబేద్కర్ బీపీ మండల్ అని, బీపీ మండల్ సూచించిన అన్ని సిఫార్సులను అమలు చేయాలని, హుస్నాబాద్ పట్టణంలో సామాజిక సంస్కర్త లైన మహాత్మ జ్యోతి బా పులే, సావిత్రి బాయి పులే, జగ్జీవన్ రామ్, బీపీ మండల్ ఇంకా అనేక సామాజిక పరివర్తకుల విగ్రహాలు ఏర్పాటు చేయాలన్నారు. కౌన్సిలర్ గాదెపాక రవీందర్ మాట్లాడుతూ... బీసీ లకు ప్రత్యేకంగా కేంద్రంలో మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని,బీసీ లు ఉద్యమాలలో ముందు ఉండాలన్నారు.బీఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ మాట్లాడుతు... కేంద్రం బీసీ లకు చట్ట సభలలో రిజర్వేషన్స్ కల్పించకపోతే గద్దె దించుదామని అన్నారు.జనజాగృతి కళాసమితి అధ్యక్షులు ముక్కెర సంపత్ కుమార్ మాట్లాడుతూ.. మహనీయుల జయంతి, వర్ధంతి లను జరుపుతూ వారి అడుగు జాడలలో నడువాలన్నారు .బీసీ సంఘం రాష్ట్ర నాయకులు నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ లకు నామినేటెడ్ పదవులలో గుర్తింపు ఇవ్వాలని అన్నారు.తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మార్క అనిల్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి సంక్షేమం కోసం అధిక బడ్జెట్ కల్పించాలని, విద్యా, ఉద్యోగాలలో అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.సామాజిక విశ్లేషకులు వడ్డేపల్లి మల్లేశం మాట్లాడుతూ.. కాంగ్రెస్ తో ప్రభుత్వం ఏర్పాటు చేసి బీహార్ కు ముఖ్యమంత్రి గా ఉంటూనే కాంగ్రెస్ లో ఉన్న అవినీతి పరుల పై కమిషన్ వేసిన మహనీయుడు బీపీ మండల్ అని అన్నారు. ఈ కార్యక్రమం లో ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్,నాంపల్లి సమ్మయ్య, వేల్పుల రాజు, బొల్లంపల్లి ప్రసాద్, బుర్ర వెంకన్న, బుర్ర జగన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### వన్ టౌన్ సీఐ కె శ్రీనివాస రావు

**(వి,వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) ఏప్రిల్ 13**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం వన్ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి ఎరైవ్ అలివే 2026 ఈ నెల 13వ తేదీ నుండి 18వ తేదీ వరకు చేపట్టనున్న కార్యక్రమాలను జయప్రదం చేయాలి బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ కే శ్రీనివాసరావు రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సమగ్ర చర్యలు తీసుకోవడం అత్యంత అవసరమని, ప్రతి పౌరుడు బాధ్యతతో ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారానే ప్రమాదాలను తగ్గించవచ్చని బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ తెలిపారు. ఎరైవ్ అలివే 2026 కార్యక్రమాన్ని భాగంగా చేసుకుని ఈ నెల 13 నుండి 18 వరకు పట్టణ వ్యాప్తంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు,తనిఖీలు, ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అన్ని శాఖల సమన్వయం ఉండేలా చర్యలు,తీసుకుంటున్నామని ప్రజల భాగస్వామ్యం కీలకమని అన్నారు. ప్రతి సంవత్సరం నిర్లక్ష్య డ్రైవింగ్, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనల వల్ల అనేక ప్రమాదాలు,జరుగుతున్నాయని, వీటిని నివారించేందుకు హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ, అప్రమత్తత వంటి అంశాలను తప్పనిసరిగా పాటించాలని సీఐ, సూచించారు. బాధ్యతాయుతమైన డ్రైవింగ్ ద్వారా మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా రక్షించవచ్చని తెలిపారు.డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్, రాంగ్ రూట్, సిగ్నల్ జంపింగ్, ఓవర్ లోడింగ్ వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

#### కార్యక్రమాల వివరాలు

డే 1 13వ తేదీ, సోమవారం పట్టణం లో అన్ని వార్డులలో కమిటీలను ఏర్పాటు చేసి ప్రజలు, యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం. మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా 9 మంది సభ్యులతో కూడిన ఒక రోడ్డు భద్రతకు సంబంధించి వార్డు కమిటీని నిర్మశీచడం జరిగింది. ఈ కమిటీలో వార్డు కౌన్సిలర్,ఒక పోలీస్ ఆఫీసర్,వార్డ్ ఆఫీసరు,ఒక డాక్టర్,ఆశా వర్కర్, అంగన్వాడి సిబ్బంది, రిటైర్డ్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగి,ముగ్గురు మహిళలో మరియు చురుకుగా ఉన్న యువతతో మొత్తం తొమ్మిది మందితో ఈ యొక్క కమిటీని నిర్మానించారు. డే 2 14వ తేదీ, మంగళవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహాల వద్ద రోడ్డు భద్రత ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించడం. అలాగే బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి సంబంధిత శాఖలతో కలిసి మరమ్మత్తు చర్యలు చేపట్టడం. డే 3 (15వ తేదీ, బుధవారం పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు, బస్సు డ్రైవర్లకు ప్రత్యేక సదస్సులు నిర్వహించడం. డే 4,16వ తేదీ, గురువారం ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, వారి లైసెన్సులు, యూనిఫామ్ తదితర అంశాలపై తనిఖీలు చేపట్టడం.డే 5,17వ తేదీ, శుక్రవారం ప్రమాద స్థలంలో ఇవ్వాల్సిన ప్రథమ చికిత్స, స్పందించే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించడం. డే 6,18వ తేదీ, శనివారం ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానాలు విధించడం, వారికి అవగాహన కల్పించడం.పట్టణ వ్యాప్తంగా ఆరు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాలకు ప్రజలు, యువత, వాహనదారులు సహకరించి విజయవంతం చేయాలని బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ, కె శ్రీనివాసరావు కోరారు.

# ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

- నిర్లక్ష్యపు డ్రైవింగ్ ప్రాణాంతకం
- నంద గోకుల్ మెదక్ జిల్లాలో ఆదర్శ గ్రామం: ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్

**మెదక్, ఏప్రిల్ 13 (ప్రజా తీర్పు ):**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం, ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో బాధ్యతాభావం పెంపొందించడం లక్ష్యంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని ఈ నెల 13 నుండి 18 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నిజాంపేట్ మండలంలోని మరుమూల గ్రామమైన నంద గోకుల్‌లో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామ ప్రజలు ఈ కార్యక్రమానికి వినూత్నంగా స్పందిస్తూ అతిథులకు స్వాగతం పలికారు. గ్రామంలో ద్విచక్ర వాహనాలు కలిగిన ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ర్యాలీలో పాల్గొని అతిథులను ఆహ్వానించడం జరిగింది. హెల్మెట్ ప్రాణరక్షణలో ఎంత ముఖ్యమో గ్రామస్థులు ఈ ర్యాలీ ద్వారా చాటిచెప్పారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని, నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్న శాతం ఎక్కువగా ఉందని, హెల్మెట్ ధరించకపోవడం వల్ల మరణాలు అధికంగా నమోదవుతున్నాయని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని స్పష్టం చేశారు. ఇంటి పెద్ద రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని, ఒక్కరి నిర్లక్ష్యం వల్ల కుటుంబం ఆర్థికంగా, మానసికంగా తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. "ప్రమాదం ముందస్తుగా చెప్పి రాదు" అనే విషయాన్ని గుర్తుంచుకుని అప్రమత్తంగా వాహనాలు నడపాలని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రతి మూడు నిమిషాలకు ఒకరు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మైనర్లు వాహనాలు నడపకూడదని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరి ప్రాణ భద్రత కోసం ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలకు ఎవరూ అతీతులు కారని, నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదాలను తప్పించుకోలేమని తెలిపారు. మరుమూల గ్రామమైన నంద గోకుల్‌లో ప్రతి ఒక్కరూ హెల్మెట్ కలిగి ఉండడం అభినందనీయమని గ్రామ ప్రజలను ప్రశంసించారు. ఈ గ్రామాన్ని మెదక్ జిల్లాలో ఆదర్శ గ్రామంగా కొనియాడారు. ఎవరైనా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపితే రూ.500 జరిమానా విధించాలని గ్రామ సభ తీర్మానించింది. ఈ సందర్భంగా రోడ్డు భద్రత కమిటీని ఏర్పాటు చేసి గ్రామ ప్రజలందరితో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, రామాయంపేట సీఐ వెంకట రాజా గౌడ్, నిజాంపేట్ ఎస్ఐ రాజేష్, ఎంపీడీఓ రాజీ రెడ్డి , ఎంఆర్ఓ శ్రీనివాస్, స్పెషల్ ఆఫసర్ దేవ్ కుమార్, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.



## అతివేగం.. అజాగ్రత్తతోనే రోడ్డు ప్రమాదాలు మెదక్ డీఎస్పి ప్రసన్నకుమార్

### కొత్తపల్లిలో అరైవ్ అలైవ్ కార్యక్రమం

**(పాపన్నపేట, ప్రజాతీర్పు మెదక్) ఏప్రిల్ 13**

అతివేగం, అజాగ్రత్త, కాస్త ఏమరపాటు వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ ప్రమాదాలలో ముఖ్యంగా యువత ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని మెదక్ డీఎస్పి ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. రూరల్ సీఐ జార్జ్, తహసీల్దార్ సతీష్, తదితర మండల అధికారులతో కలిసి మండల పరిధిలోని కొత్తపల్లిలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీస్, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా వాహనదారులకు, ప్రజలకు రోడ్డు భద్రత నియమాలు, నిబంధనల పై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి మహిళలు, వాహనదారులు భారీ ఎత్తున తరలివచ్చి అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలకు రక్షణ కవచంల ఉంటుందన్నారు. కారులో సీటు బెల్టు ధరించాలన్నారు. పోలీసుల జరిమానా విధిస్తారని హెల్మెట్ ధరించడం కాదు.. మీ ప్రాణాలు కాపాడుకోవడం కోసమన్నారు. ఎవరికి వాళ్ళు స్వతహాగా నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చున్నారు. ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్ ఫోన్, మైనర్లు డ్రైవింగ్, ఓవర్ టేకింగ్, టర్నింగ్ పాయింట్ వద్ద క్రాసింగ్ లు చేయడంవల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

## ఉన్నత ఫలితాలు సాధించిన బీసీ బిడ్డలు కురిమిళ్ళ సాయి చరణ్, ఎర్రవేణి అకిరా జాను విద్యార్థులకు సన్మానం

**(దండే భూమన్న ప్రజాతీర్పు మంచిర్యాల) ఏప్రిల్ 13**



మంచిర్యాల పట్టణంలోని జన్మభూమి నగర్ లో నిన్న ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన బీసీ బిడ్డలు అకిరా జాను 470 కి కాను 465 అలాగే సాయి చరణ్ 470 కి గాను 464 మార్కులు సాధించి మొదటి వరుసలో నిలిచిన మా బీసీ బిడ్డలను జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానిస్తూ నాయకులు మాట్లాడుతూ చిరంజీవిలను ఆశీర్వదిస్తూ అభినందిస్తూ అత్యంత వెనుకబడిన కులాలైన నాయి బ్రాహ్మణ గొల్ల కురుమ కులానికి చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభను కనబరచడం అంటే బీసీలుగా స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నాము వారి కులవృత్తులు చేసుకుంటూ పిల్లలను ఉన్నత చదువులు చదవడానికి వారికి ఎంత కష్టం ఉన్నా కూడా ఆ కష్టాన్ని పిల్లలకు తెలియకుండా పెంచిన తల్లిదండ్రుల కష్టాన్ని ఆ పిల్లలు కూడా గుర్తించి చదువులో రాణిస్తూ ఇవాళ రాష్ట్ర స్థాయిలో మంచి మార్కులు తెచ్చుకోవడం జరిగింది రాబోయే రోజుల్లో ఈ యొక్క విద్యార్థులు బీసీల స్థితిగతులు మార్చే స్థాయికి వారు ఎదగాలని ఆకాంక్షిస్తున్నాము ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు గుమ్ముల శ్రీనివాస్ జిల్లా అధ్యక్షులు, రామగిరి రాజన్న చారి, వేముల అశోక్, తిరుపతి, కురిమిళ్ళ రాజేష్, కురుమిళ్ళ శ్రీనివాస్, అంకం సతీష్ పాల్గొన్నారు.



## మందమర్రి కార్యాలయం ముందు సహారా బాధితుల ధర్నా

### ఫిక్స్ డిపాజిట్ చేసి కాలపరిమితి దాటిన మా డబ్బులను చెల్లించాలని ఆందోళన చేసిన బాధితులు

**మంచిర్యాల, ఏప్రిల్ 13 (ప్రజాతీర్పు)**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మందమర్రి మార్కెట్ లో ఉన్న సహారా కార్యాలయం ముందు సహారా ఇండియా సంస్థ లో మేము ఫిక్స్ డిపాజిట్ చేసిన డబ్బులను కాలపరిమితి దాటిపోయి 4-5 సంవత్సరాలు గడుస్తున్నా సహారా యాజమాన్యం డబ్బులు చెల్లించకపోవడానికి నిరసన గా బాధితులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లే కార్డ్స్ చేత బూని సహారా ఇండియా లో మేము ఫిక్స్ డిపాజిట్ చేసిన కాలపరిమితి దాటిపోయి మా డబ్బులను మాకు వెంటనే చెల్లించాలని నిరసన చేస్తూ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. మేము కట్టిన డబ్బులను వెంటనే చెల్లించాలని లేని యెడల జిల్లా వ్యాప్తంగా శాంతియుతంగా నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సహారా బాధితులు పేర్కొన్నారు. లక్షలాది మంది సహారా బాధితుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా లోని ఎం ఎల్ ఏ లు , రాష్ట్ర కార్మిక శాఖ మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకట స్వామి వారు , అదే విధంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ వారు సహారా బాధితుల సమస్యను పరిష్కరించడానికి కృషి చేయాలని ఈ సందర్భంగా బాధితులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మందమర్రి సహారా ఇండియా మేనేజర్ వారికి మా డబ్బులు మాకు వెంటనే ఇప్పించాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం, తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక అధ్యక్షుడు మరియు సహారా ఇండియా బాధితుడు గజెల్లి వెంకటయ్య , సహారా బాధితులు సిహెచ్ సంజీవ్, డి రాజమౌళి, రామ్ నరేష్ బాబు, సి హెచ్ సంపత్ , ఎస్ మధు, దుర్గం మల్లేశ్వరి, భేరి రమాదేవి, దూత లక్ష్మి, పాషా, అబేదా పాల్గొన్నారు..



## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం - ప్రజావాణిలో 67 దరఖాస్తులు.

**(వై యాదగిరి ప్రజాతీర్పు, మహేశ్వరం రిపోర్టర్) ఏప్రిల్.13**

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 67 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి గారికి వివరించి అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల సత్వర పరిష్కారం లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ రోజు అందిన ఫిర్యాదుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 29 కాగా, ఇతర శాఖలకు సంబంధించినవి 38 ఉన్నాయి. మొత్తం 67 దరఖాస్తులు స్వీకరించబడ్డాయి. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ వేసవి కాలంలో తాగునీటి కొరత లేకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే గురుకులాలు, హాస్టళ్లలో అర్హత కలిగిన బాలికలందరికీ హెచ్‌పీవీ టీకా అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా 13-04-2026 నుండి 18-04-2026 వరకు నిర్వహించనున్న "అరైవ్-అలైవ్" రహదారి భద్రత కార్యక్రమం సందర్భంగా హాజరైన అధికారులతో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి (రెవెన్యూ), జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన... సర్ధనలో పోలీసుల కీలక సూచనలు

**మెదక్, ఏప్రిల్ 13 (ప్రజా తీర్పు ):**



మెదక్ జిల్లా హావేళ్ళి ఘణపూర్ మండలం సర్ధన గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ పి. కిష్టయ్య, నరహరి పాల్గొని గ్రామస్థులకు రోడ్డు భద్రత నియమాల ప్రాముఖ్యతను వివరించారు. గ్రామ సర్పంచ్ వినోద్ సతీష్, ఉప సర్పంచ్ రామ్ చందర్, కార్యదర్శి ప్రమోద్ కుమార్, వార్డు సభ్యులు వడ్డే రమేష్, మల్లన్న, రాజు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు, యువకులు మరియు ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా సేఫ్టీ బెల్ట్, హెల్మెట్ వంటి భద్రతా పరికరాలు ఉపయోగించాలని సూచించారు. వాహనం ఫిట్‌నెస్, లైట్లు సరిగా ఉన్నాయో లేదో తనిఖీ చేసుకోవాలని తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని, వాహనం నడుపుతూ ఫోన్ మాట్లాడరాదని హెచ్చరించారు.అలాగే డ్రైవింగ్ సమయంలో నిద్ర మత్తులో ఉండకూడదని, చిన్నపిల్లలు రోడ్డుపైకి వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి డ్రైవర్‌కు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, అన్ని నియమాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.



## ఆటో డ్రైవర్లకు రవాణా శాఖ సూచనలు - కలెక్టర్ చేత కరపత్రాల విడుదల

**(వై యాదగిరి ప్రజాతీర్పు, మహేశ్వరం రిపోర్టర్) ఏప్రిల్.13**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "ూతీతీఅజవ ూశ్రీఅజవ" థీమ్‌తో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టిన నేపథ్యంలో,ఆటో డ్రైవర్లకు రవాణా శాఖ సూచనలతో కూడిన కరపత్రాలను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి విడుదల చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు.ముఖ్యంగా ఆటో డ్రైవర్లు ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ,అతివేగం,ఓవర్‌లోడింగ్,నిర్లక్ష్య డ్రైవింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు.రవాణా శాఖ అధికారులు రూపొందించిన ఈ కరపత్రాల్లో ట్రాఫిక్ నియమాలు,భద్రతా సూచనలు,అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు వివరంగా ఉన్నాయి.ఈ కరపత్రాలను డ్రైవర్లకు పంపిణీ చేసి అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు, సిబ్బంది మరియు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఘట్‌కేసర్‌లో చలివేంద్రం ప్రారంభించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



### చలివేంద్రాన్ని ప్రారంభించిన మల్లారెడ్డి హెల్త్ సిటీ ట్రస్ట్

**(మొక్క ఉపేందర్ ప్రజాతీర్పు ప్రతినిధి హైదరాబాద్) ఏప్రిల్ 13:**

మేడ్చల్ జిల్లా జిహెచ్ఎంసి ఉప్పల్ జోన్ ఘట్కేసర్ సర్కిల్ లో మల్లారెడ్డి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఔటర్ రింగ్ రోడ్డు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చౌరస్తాలో చలివేంద్రాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుతం ఎండలు విపరీతంగా ముదిరిపోయిన కారణంగా వాహనదారులు, పాదచారులు ప్రజలకు మంచినీరు అవసరాన్ని గుర్తించి వాడి దాహార్తిని తీర్చడానికి చలివేంద్ర కేంద్రాన్ని ప్రారంభించామని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రజలు అవసరమైతే తప్ప మిగతా సమయంలో బయటికి రాకూడదని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి హెల్త్ సిటీ ట్రస్ట్ చైర్మన్ భద్రారెడ్డి, మున్సిపల్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి, ఘట్కేసర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, మాజీ కౌన్సిలర్లు చందుపట్ల వెంకటరెడ్డి, కొమగోని రమాదేవి, మహిపాల్ గౌడ్, పోచారం మాజీ కౌన్సిలర్లు, బి ఆర్ ఎస్ నాయకులు నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్, జగన్మోహన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల జేఏసీ అధ్యక్షులు మారం లక్ష్మారెడ్డి, తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల జేఏసీ నాయకులు మొక్క ఉపేందర్, ఘట్కేసర్ మండలంలోని మాజీ సర్పంచ్ నర్సింగ్ రావు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజా ప్రతినిధులు, కో-ఆప్షన్ సభ్యులు వార్డు కమిటీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా సభ్యులు, నాయకులు, బూత్ కమిటీ సభ్యులు తదితర నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

## ప్రభుత్వ కార్యాలయాల్లో మౌలిక సదుపాయాలపై చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి గెజిటెడ్ అధికారుల విజ్ఞప్తి

**(వై యాదగిరి, ప్రజాతీర్పు రిపోర్టర్) ఏప్రిల్ 13**



రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం మహిళా ఉద్యోగుల సౌకర్యాల కోసం కీలక విజ్ఞప్తి చేసింది.తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.శంషాబాద్ మండలంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన ఎంపీకి సమర్పించిన వినతిలో,చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో మహిళలు పనిచేసే ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు నిర్మించాలని,సుమారు 500 కార్యాలయాల్లో ఆర్.ఓ వాటర్ ప్యూరిఫైయర్లు ఏర్పాటు చేయాలని కోరారు.ఈ సందర్భంగా స్పందించిన ఎంపీ,నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ పరిధుల్లో టాయిలెట్ల నిర్మాణం మరియు నిర్వహణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అలాగే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధులు వెటర్నరీ క్లినిక్‌లకు అవసరమైన మౌలిక వసతులు,త్రాగునీటి సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా గెజిటెడ్ అధికారుల డైరీని ఎంపీకి అందజేశారు.కార్యక్రమాన్ని విజయవంతం చేసిన జిల్లా అధ్యక్షుడు డా.కె.రామారావు, కార్యదర్శి శ్రీనివాస్ కుమార్ నోరి,శాంతి శ్రీలకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఉమెన్స్ వింగ్ ట్రెజరర్ జి.శాంతి,జిల్లా సంక్షేమ అధికారి పి.శ్రీలత,వికలాంగుల పునరావాస కేంద్ర ప్రతినిధులు రమేష్, బిక్షపమ్మ, జ్ఞానేశ్వరి,సుగుణ పాల్గొన్నారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020